తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## భర్తను కడతేర్చిన భార్య.. ప్రియుడు అరెస్ట్



కుప్పం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త
మండలంలోని మోట్లచేను పంచాయతీ గ్రామంకు చెందిన భూపతిని అతని భార్య, ప్రియుడు హత్యచేయడంతో వారిని అరెస్ట్ చేసినట్లు అర్బన్ సిఐ శంకరయ్య తెలిపారు. సిఐ తెలిపిన మేరకు వివరాలిలా.. మోట్లచేను గ్రామంలో భూపతి అతని భార్య గీత (36) ఉండేవారన్నారు. గీత తమిళనాడులోని వరమలగుండ గ్రామానికి చెందిన తిమ్మన్ పొన్నుకన్ అలియాస్ మసితిమ్మ (41అనే వ్యక్తితో అక్రమ సంబంధం కలిగి ఉండేదన్నారు. తన అక్రమ సంబంధానికి భర్త అడ్డువస్తున్నాడని భావి ంచి గత నెల 22వతేది భూపతిని హత్యచేసి మామిడిచెట్టుకు ఉరేసి ఆత్మహత్యగా చిత్రీకరించారన్నారు. ఈ విషయంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా మృతుడి భార్య గీత, ఆమె ప్రియుడు మసితిమ్మలు కలసి భూపతిని హతమార్చారని రుజువైందన్నారు. దీంతో వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అర్బన్ ఎస్సై బాబు పాల్గొన్నారు.

## త్రుటిలో తప్పిన ఘోర ప్రమాదం..

### డ్రైవర్ల నిరక్షంతో ఢీకొన్న రెండు బస్సులు..



రేణిగుంట ఏప్రిల్ 4 ప్రభాతవార్త
రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని కేఎల్‌ఎం సర్కిల్ వద్ద శనివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం త్రుటిలో తప్పింది. డ్రైవర్ల నిరక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. అందిన సమాచారం మేరకు తిరుమన్నామలై వెళ్తున్న ఓ బస్సు అదుపుతప్పి మరో బస్సు ని ఢీకొంది. ఈ ప్రమాదంలో రోడ్డుపై ఉన్న రెండు కార్లు, ఒక టెంపో పాక్షి కంగా దెబ్బతిన్నాయి. పలువురికి స్వల్ప గాయాలు మినహా ప్రాణ నష్టం జరగలేదు. రోడ్డు కిరువైపులా వేలాది వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్కు ఇబ్బంది కలిగించాయి. తక్షణం స్పందించిన ఎస్సై నాగరాజు తమ సిబ్బందితో అక్కడికి చేరుకొని ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించి కేసు నమోదు చేసుకుని

## తిరుపతి నగరపాలకలో

## ఎన్నికల వార్డుల విభజన అభిప్రాయ సేకరణ



తిరుపతి,ఏప్రిల్ 4ప్రభాతవార్త:
తిరుపతి నగరంలో పెరగనున్న ఎన్నికల వార్డుల విభజన, పెంపు ప్రక్రియను జాగ్రత్తగా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరంలో జనాభా ప్రాతిపదికన ఎన్నికల వార్డుల విభజన, పెంపుపై నగరపాలక సంస్థ రెవిన్యూ, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, స్వర్ణ వార్డు కార్యదర్సులతో శనివారం కమిషనర్ సమావేశం నిర్వహించారు. తిరుపతి నగరపాలక సంస్థలోని 50 వార్డులను 66 వార్డులకు పెంచేలా నిర్ణయించారని తెలిపారు. ఈ వార్డుల విభజన, పెంపు ప్రక్రియ లో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహారించాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో సర్వే నెంబర్లు, జనాభా, తదితర వాటిని ప్రామానికంగా జాగ్రత్తగా పరిశీలించి విభజన చేయాలని తెలిపారు. ఈ నెల 9వ తేదీ లోపు వార్డుల విభజన ప్రక్రియ ముసాయిదా సిద్ధం చేయాలని తెలిపారు. వార్డులను విభజించే ప్రతిపాదనను ఫారం 1 ద్వారా 10 వ తేదీ నుండి 16 వ తేదీ వరకు నగరపాలక సంస్థ నోటీసు బోర్డు, ఇతర ప్రకటనల ద్వారా ప్రజల అభ్యంతరాల కొరకు ఉంచాలని తెలిపారు. 25 వ తేదీ లోపు మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా ఎన్నికల వార్డుల విభజన ప్రతిపాదనలను ఖరారు చేసి, మున్సిపల్ పరిపాలన కమిషనర్ డైరెక్టర్‌కు సమర్పించడం జరుగుతుందని తెలిపారు. మే రెండవ తేదీ లోపు ప్రజల నుండి వచ్చిన వినతిపత్రాలను, మున్సిపల్ కార్పొరేషన్ యొక్క అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తరువాత, మున్సిపల్ పరిపాలన కమిషనర్ డైరెక్టర్ చేత మున్సిపల్ కార్పొరేషన్ యొక్క వార్డు విభజన ప్రతిపాదనలకు ఆమోదం తెలపడం జరుగుతుందని తెలిపారు. మే 5వ తేదీ లోపు కమిషనర్ ద్వారా ఆంధ్రప్రదేశ్ గెజిట్‌లో ఫారం 6 లో తుది నోటిఫికేషన్ ప్రచురణ చేయడం జరుగుతుందని తెలిపారు.

## బలవంతపు భూసేకరణ ఆపండి

### సర్వే బృందాన్ని అడ్డుకున్న పలువురు రైతులు



సత్యవేడు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:
బలవంతపు భూసేకరణ చేయరాదని సత్యవేడు మండలం ఇరుగుళం పంచాయతీ రైతులు పలువురు ఆందోళనకు దిగారు. శనివారం భూసేకరణకు సర్వే బృందం రావడంతో రైతులు దీనిపై నిరసన వ్యక్తం తెలియజేశారు. ఈ సందర్భంగా రైతులు విజయశంకర్‌రెడ్డి, కాశీ ప్రతాప్‌రెడ్డి, సుశీల్‌కుమార్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డిలు మాట్లాడుతూ భూ సేకరణ తమ గ్రామంలో రెండు దశాబ్ధాలుగా వ్యతిరేకిస్తున్నామన్నామని, అయినా ఇక్కడ విలువైన భూములను ఏపీఐఐసీకి ఇవ్వడానికిరైతులు ఎవరు సిద్ధంగా లేరన్నారు. భూసేకరణ కనీసం రైతుల అభిప్రాయాలను తెలుసుకోకుండా ఏకపక్షంగాప్రభుత్వం వ్యవహరించడం సరికాదన్నారు. దీనిపై గ్రామసభ నిర్వహించిరైతుల అభిప్రాయాలను తెలుసుకున్న తరువాతే భూ సేకరణ ప్రక్రియను చేపట్టాలన్నారు. అయితే ఇందుకు భిన్నంగా ఏపీఐఐసీ అధికారులు సర్వే బృందాలను రైతుల భూముల్లోకి దింపడంసరికాదన్నారు. ఇది భూసేకరణ చట్టానికి విరుద్ధంగా గ్రామంలోని సన్నా చిన్నకారు రైతులు ఎవరు భూములు ఇవ్వడానికి సుముఖంగా లేరని ఆయన చెప్పారు. బలవంతపు బూసేకరణ చేసి రైతుల పొట్ట కొట్టొద్దు అన్నారు. ఇప్పటికే అనేక గ్రామాల్లో సహకరించిన భూములు చాలా వరకు ఖాళీగా ఉందన్నారు. ఏపీఐఐసీ సేకరించిన ఈ భూములు పూర్తి స్థాయిలో వినియోగంలోకి వచ్చిన తరువాతే తదుపరి రైతుల అభిప్రాయాలను సేకరించి ఏకాభిప్రాయంతోనే భూసేకరణ ప్రక్రియ చేపట్టాలన్నారు. ఈ నేపథ్యంలో కొందరు రైతుల సర్వేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతుల భూముల్లో సర్వే చేయడానికి వీలు లేదని సర్వే బృందానికి తెగేసి చెప్పారు. బలవంతపు భూసేకరణ వ్యతిరేకిస్తూ దీనిపై రెవెన్యూ భూసేకరణ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్‌కి వినతులు పంపగా ఆందోళన ముగిసిన వెంటనేరైతులు సూళ్లూరుపేట చేరుకుని ఆర్డీవో దేవేంద్ర రెడ్డిని కలసి వినతి సమర్పించి సమస్యను వివరించారు. దీనిపై ఆర్డీవో స్పందిస్తూ త్వరలోనే గ్రామసభ ఏర్పాటు చేసి రైతుల అభిప్రాయాలను తెలుసుకుంటామని హామీ ఇచ్చినట్టు సమాచారం. ఈ కార్యక్రమంలోరైతులు బాలసుందరంరెడ్డి, రఘునాథరెడ్డి, ధనంజయరెడ్డి, బాలాజీరెడ్డి, శ్రీరామచంద్రారెడ్డి, రవిరెడ్డి, చంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి,సరవణ, శ్యాంబాబు రెడ్డి, తిరుపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## శివయ్య సన్నిధిలో కొలువు : దినదిన గండం

### సిబ్బందిపై దౌర్జన్యాలు: రక్షణ కరువు

**ముల్లోకాల్ని ఏలే ముక్కంటిశుని సన్నిధిలో కొలువు సిబ్బందికి దిన దినగండంగా మారింది.భోళాశంకరుడు దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు వరాలిస్తుంటే ఇక్కడ పని చేసే సిబ్బంది రోజూ ఏం విపత్తు ఎదుర్కొవాల్సి వస్తుందో అని గుండె అరచేతిలో ఎపెట్టుకొని ఉద్యోగం చేయాల్సి వస్తుంది. భక్తులకు ప్రశాంతత ఇస్తున్న భోళాశంకరుడు తన కొలువులో విధుల నిర్వహిస్తున్న ఉద్యోగులకు రోజూ ఆందోళన తప్పటం లేదు. ఆలయంలో రోజు రోజుకు రాజకీయ నాయకుల నీడలో చేరే వారి సంఖ్య పెరుగుతుంది.కూటమి ప్రభుత్వంలోని నాయకుల అనుచరులే కాకుండా ప్రతిపక్ష పార్టీకి చెందిన వారుకూడా సిబ్బందిపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారంటే ఇక్కడ ఉద్యోగుల దయనియ స్థితి అర్థమౌతుంది.ఒక్కొక్క రాజకీయ నాయకుని అనుయాయులు గుంపులు, గుంపులుగా తీసుకురావటం సిబ్బందిపై అజమాయిషి చేలాయించటం నిత్య కృత్యమైంది**



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 4 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారుతుంది. ముఖ్యంగా స్వామి అమ్మవార్ల సన్నిధి వద్ద పని చేస్తున్న ఉద్యోగులు ఏ రోజూ ఎవరి చేత ఏ వివాదం ఎదుర్కొవాల్సి వస్తుందో అని మధన పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు తమకు ప్రశాంతత కల్గించాలని కోరుకుంటుంటే ఇక్కడ విధులు నిర్వహించే ఉద్యోగులు ఈ రోజు విధుల్లో ఎవరి చేత కూడా తమకు ఇబ్బంది లేకుండా చూడు శివయ్యా అంటూ విధుల్లో చేరుతున్నారు.

**ఓ వైపు దళారుల బాధ-మరో వైపు గేట్ల వద్ద దౌర్జన్యాలు:**
శ్రీకాళహస్తీశ్వరాలయంలో రోజు రోజుకు దళారుల బాధ పెరుగుతుంది. దళారులను కట్టడి చేయటానికి కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఇఓ అధ్యయనం చేసిన తరువాత ఇక్కడ దళారుల బాధలను అరికట్టుడానికి విజిలెన్స్‌ను నియమించారు. అయితే విజిలెన్స్ కమిటిగా నియమించిన వారు ఇక్కడ ఎవరు దళారులో గుర్తించి జాబితాను సిద్ధం చేసారు.అయితే వారిపై చర్యలు తీసుకోవటానికి తటపటాయిస్తున్నారు. కారణం ఇక్కడ ఎవరు బయట దళారులో ఎవరు రాజకీయ నీడలో కొనసాగుతున్న వారో తెలియక తటపటాయిస్తున్నారు.రద్దీ రోజుల్లో ఉద్యోగులు ఏం ఎదుర్కొవాల్సి వస్తుందో అని గెండెలరచేతితో పెట్టుకొని డ్యూటీలు చేస్తున్నారు. ఆదివారం స్వామి సన్నిధిలో జరిగిన ఓ సంఘటనతో ఉద్యోగుల్లో అభద్రతా భావం పెరిగింది.వివరాలు పరిశీలిస్తే స్వామి సన్నిధి వద్ద రవి అనే ఉద్యోగి విధులు నిర్వహిస్తున్నారు.ఇక్కడ ప్రదక్షిణకు సంబంధించి ఉద్యోగులకు ఇఓ దిశ దెశ నిర్దేశం చేసారు. ఇక అంతరాలయ దర్శనానికి ప్రత్యేకంగా రూ.500ల టిక్కెట్లు కొనుగోలు చేసిన వారిని క్యూలైన్లో పంపటానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. అయితే ఓ యువకుడు అడ్డదారిలో ఓ 15 మందితో వస్తుండగా అక్కడ పని చేస్తున్న రవి అభ్యంతరం చెప్పారు. దాంతో ఆ యువకునికి ఆగ్రహం వచ్చింది.స్వామి సన్నిధి ఎదురుగా హల్‌చల్ చేసాడు. అక్కడున్న భక్తులు ముక్కున వేలేసుకున్నారు. స్థానికులైనా ఉద్యోగులపైఇంత దౌర్జన్యామా?అంటూ పెదవి విరిచారు. ఈ గొడవ రబసగా మారింది. దాంతో విధి నిర్వహణలో ఉన్న టెంపుల్ ఇన్సెపెక్టర్ వెంకటస్వామి చేరుకున్నారు. ఆయనపై కూడా తిరగబడ్డాడు. తనకు టిక్కెట్టు ఉందంటూ వాదించాడు. అయితే టిక్కెట్లు కొనుగోలు చేసిన వారి కోసం క్యూ ఏర్పాటు చేసినట్లు ఆవేశంగా ఊగిపోతున్న యువకునికి బుజ్జగించుటకు ప్రయత్నించగా తాను ఫిర్యాదు చేస్తామంటూ వాదిస్తుండగా సహనం కొల్పొయిన టెంపుల్ ఇన్సెపెక్టర్ ఫిర్యాదు చెయ్యి 'నాపేరు వెంకటస్వామి. నేను టెంపుల్ ఇన్సెపెక్టర్‌ని' అని యువకునికి వివరించారు.

**ఇది ఒక రోజు కాదు . . . నిత్యం ఇదే తంతు . . .**
శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఇది ఆదివారంతంతు కాదు ప్రతి నిత్యం రద్దీ రోజుల్లో ఇదే పరిస్థితి.ఇక్కడ కొందరు రాజకీయనాయకుల సిఫార్సులతో చేరారు. వారు వచ్చిన వెంటనే తలుపులు తెరచుకోవాలి. ఆలీబాబా 40 దొంగలు సినిమాలో లా గేట్లు తెరచుకోవాలి.లేదంటే గేట్లు వద్ద ఉన్న ఉద్యోగి పని అయినట్లే. క్యూలైన్లలో భక్తులు గంటల తరబడి నిరీక్షిస్తుంటే వచ్చిన రాజకీయ నాయకుల అనుచరులు తనతో పిలుచుకొని వచ్చిన వారిని రాజమార్గంగా తీసుకెళ్లాలి. ఎవరైనా ఉద్యోగి అభ్యంతరం చెబితే ' రేయ్ మాట్లాడతావా' అంటూ ఫోన్ ఇవ్వబోతారు. ఇదేమి చొద్యమని సిబ్బంది మధన పడుతున్నారు. మరి ఆలయాధికారి విజిలెన్స్ ఏర్పాటు చేస్తే ఎవరు ఎవరిని కట్టడి చేయాలి? ఏదీ ఏమైనా శివయ్య సన్నిధిలో కొలువు చేస్తున్న ఉద్యోగులకు దిన దిన గండంగా మారింది.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఏం జరుగుతుంది?

### పరస్పర దాడులు: పోలీసుస్టేషన్‌కెక్కిన వివాదం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఏం జరుగుతుంది? శనివారం రద్దీ అధికం. ఉదయం ఓ వివాదం. మళ్ళీ మధ్యాహ్నం మరో వివాదం.భక్తులపై ఆలయంలోని పిఆర్‌ఓ కార్యాలయంలోపనిచేసే వ్యక్తి దాడి. పిఆర్‌ఓ కార్యాలయంలో దూరి బయటి వ్యక్తులు దాడి.పరస్పర దాడులతో పోలీసు స్టేషన్‌కెక్కిన పంచాయతీ.ఆలయంలో పని చేసే వ్యక్తిఫిర్యాదుపై కేసు.బాధితుల ఫిర్యాదు తీసుకోవాలంటే ఇఓ అనుమతి కావాలన్న పోలీసు అధికారి. వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాళహస్తిలోని బహదూరుపేటకు చెందిన గతంలో ప్రజారాజ్యంలో కీలకంగా వ్యవహరించిన ఆర్ముగం సతీమణి కుమారుడు శనివారం ఆలయానికి వెళ్ళి నట్లు చెబుతున్నారు. రూ.500ల టిక్కెట్లు కొనుగోలు చేసి క్యూలైన్లో ఉండగా పిఆర్‌ఓ కార్యాలయంలో ఉండే ఓ వ్యక్తి కొందరిని తీసుకెళ్ళగా అక్కడ వివాదం మొదలైంది. అయితే వివాదాలకు సంబంధించి పిఆర్‌ఓ కార్యాలయం వద్ద ఉండే ఉద్యోగి కంచుగడప వద్ద వారి కోసం వేచి వారు బయటకు రాగా మళ్ళీ గొడవ పడ్డారు.దాంతో బాదితులు ఇఓ, చైర్మెన్ ఛాంబర్ వద్దకు వెళ్ళగా ఇరువురు అందుబాటులో లేదు. తరువాత ఈ సంఘటనలకు సంబందించి పంచాయతీలు జరిగాయి. అయితే ఆర్ముగం కుమారుడు తమను అవమాన పరచిన వ్యక్తికోసం వెతకినట్లు సమాచారం,. సాయంత్రం పిఆర్‌ఓ కార్యాలయం వద్దకు వెళ్లి లోపల ఉండటంతో దాడికి పాల్పడినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఈ పంచాయతీ పోలీసు స్టేషన్‌కు చేరింది. పోలీసు స్టేషన్లో ఒక దశలో ఇరువర్గాలు రాజీపడుతున్నారనే సంకేతాలు వచ్చాయి. అయితే సిఐ ఛాంబర్‌లో ఏమైందో ఏమో బాదితులుగా చెప్పబడుతున్న మహిళ ఫిర్యాదు తీసుకోవాలంటే ఇఓఅనుమతి కావాలని తిరస్కరించినట్లు సమాచారం.కానీ పిఆర్‌ఓ కార్యాలయంలో పనిచేసే శివపై దాడి చేసినట్లు సిసి పుటేజీలు పరిశీలించి ఆతని పిర్యాదునుతీసుకొని కోర్టుకు పంపుతున్నట్లు కోర్టు ఆదేశాలతో కేసును నమోదు చేస్తామని సిఐ ప్రకాష్‌రావు వివరించారు.

## సూళ్లూరుపేటలో రైల్వే

## అదనపు సబ్‌స్టేషన్‌కు సన్నాహాలు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 4 ప్రభాతవార్త



సూళ్లూరుపేట రైల్వేకు సంబంధించి అదనంగా మరో సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ 120 టన్నుల బరువైనవి రెండింటిని రైల్వేస్టేషన్ పక్కన నిర్మిస్తున్న సబ్‌స్టేషన్ వద్దకు శనివారం తీసుకెళ్లేందుకు రైల్వే అధికారులు అష్టకష్టాలు పడ్డారు. ఈ సబ్‌స్టేషన్ ఏర్పాటుతో రైల్వేకి సంబంధించి రన్నింగ్ ట్రైన్లకు మెరుగైన విద్యుత్ సౌకర్యంతో పాటు స్టేషన్‌లో స్టాపింగ్‌లో ఉండే రైళ్లకు ఎటువంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించే విధంగా రైల్వే ఎలక్ట్రిసిటీ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇదేవిధంగా దొరవారిసత్రం, తడ, ఆరంబాకం, గుమ్మిడిపూండి ప్రాంతాల్లో కూడా సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. ఇందుకోసం సుమారు రూ.250 కోట్లు నిధులు వ్యయమయ్యే అవకాశాలు ఉన్నాయని సమాచారం. ఇదిలావుంటే ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించేందుకు రైల్వేస్టేషన్ వద్ద ఉన్న ఆర్చి ఇబ్బందికరంగా ఉండటంతో సాయంత్రం వరకు స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులను ఆపేశారు. అతికష్టంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకెళ్లారు.

## చెట్టును ఢీకొన్న ద్విచక్ర వాహనం

### ఒకరు మృతి, మరొకరికి తీవ్రగాయాలు



రైల్వేకోడూరు రూరల్. ఏప్రిల్ 4 ప్రభాతవార్త
రైల్వే కోడూరు మండలంలోని చిట్వేల్ రోడ్డు విజయ కన్వెన్షన్ సమీపంలో శనివారం సాయంత్రం ఒక ద్విచక్ర వాహనంలో ఇద్దరు యువకులు అతివేగంగా రోడ్డు ప్రక్కన ఉన్న చెట్టును ఢీకొనడంతో సంఘటనలోనే ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. మృతి చెందిన యువకుడు దాదాపు 20 సంవత్సరములు వయసు ఉంటుందని వీరిది మండలంలోని వివి కండ్రిక ఎస్టీ గ్రామానికి చెందిన వారిని స్థానికులు తెలిపారు. అతివేగంతో ప్రయాణం చేయడం ఆవేగంతో చెట్టును ఢీకొనడం వాహనం తోలుతున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడి ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చారు. వీరు వేగానికి ద్విచక్ర వాహనం ముక్కల ముక్కలు పోవడం ఆశ్చర్యానికి గురిచేసింది. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆటో డీ..యువకుడు దుర్మరణం..!

గంగవరం, ఏప్రిల్ 4, ప్రభాతవార్త :
పాలును రవాణా చేస్తున్న ఆటో డీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందిన సంఘటన శుక్రవారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది.పోలీసుల కథనం మేరకు వివరాలిలా..మండలంలోని గంగవరం పంచాయతీ మారేడుపల్లె గ్రామానికి చెందిన మునిరత్నం చిన్న కుమారుడు సంజయ్(25) అనే యువకుడు అదే గ్రామానికి చెందిన తన మిత్రుడు పృద్వీరాజ్‌తో కలిసి తన ద్విచక్రవాహనంలో తమ స్వగ్రామం నుండి పలమనేరు వైపు వస్తూ ముందు వెళ్తున్న ఓ వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తుండగా కల్లుపల్లె గ్రామానికి చెందిన హరి అనే వ్యక్తి ఆటోలో సింగిల్ లైట్‌తో ఎదురుగా వస్తున్న ఆటోను డీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది,ఈ ప్రమాదంలో సంజయ్‌కు తీవ్ర గాయలతో అక్కడికక్కడే దుర్మరణం చెందగా పృద్వీరాజ్ కూడా తీవ్రంగా గాయపడ్డాడు.తీవ్రంగా గాయపడ్డ పృద్వీరాజ్‌ను స్థానికులు పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తరలించారు.మృత దేహన్ని శవ పరీక్ష నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో మృతి చెందిన సంజయ్ (ఫైల్‌ఫోటో)

## భగ్గుమన్న కంటైనర్..!

### అగ్నికి ఆహుతైన ఆటోలు..రూ.32 లక్షలు ఆస్థి నష్టం..!



బంగారుపాళ్యం, ఏప్రిల్ 4, ప్రభాతవార్త :
మధ్యాహ్నపు వేళ..భోజనం కోసం ఓ డాబాలో ఆపి వెళ్ళిన కంటైనర్ నుండి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కంటైనర్ పూర్తిగా దగ్ధమైన సంఘటన చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలంలో చోటు చేసుకుంది.సిఐ శ్రీనివాసులు కథనం మేరకు వివరాలిలా..బీహార్ రాష్ట్రానికి చెందిన సుమన్(29) అనే కంటైనర్ లారీ డ్రైవర్ బెంగళూరు నుండి ఆటోలను కంటైనర్ ద్వారా జార్ఖండ్‌కు ఎగుమతి చేస్తున్న నేపథ్యంలో మండలంలోని బెంగళూరు-చెన్నై జాతీయ రహదారి పక్కన కేజీ సత్రం వద్ద హర్యానా డాబాలో కంటైనర్‌ను ఆపి భోజనం కోసం వెళ్ళగా..కంటైనర్ నుండి ఆకస్మికంగా ఒక్కసారిగా మంటలు చెలరేగడంతంతో కంటైనర్ పూర్తిగా దగ్ధం కావడంతో పాటు కంటైనర్‌లో రవాణా చేస్తున్న ఎనిమిది ఆటోలు కూడా దగ్ధమయ్యాయి.ఈ ప్రమాదంలో దగ్ధమైన వాహనాలు విలువ సుమారు రూ.32 లక్షలు నష్టం వాటిల్లినట్లు ఆయన తెలిపారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఇరువర్గాల ఘర్షణ... ఒక వర్గానికి రక్తగాయాలు



స్టేషన్‌లో సిఐను నిలదీస్తున్న రోజా

### ఇరు వర్గాలపై కేసు పెట్టిన పోలీసులు

పుత్తూరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :
పట్టణంలోని గేట్‌పుత్తూరులో శుక్రవారం రాత్రి రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఒక వర్గానికి చెందిన వ్యక్తులు మరొక వర్గానికి చెందిన వారిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. దాంతో ఒక మహిళలకు, మరొక వ్యక్తికి రక్తగాయాలయ్యాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా వున్నాయి. గేట్‌పుత్తూరులో కె.పి.చొక్కలింగం వర్గానికి ఎస్.శ్రీనివాసులు తదితరులకు పాతకక్షలున్నాయి. గొడవలకు కారణమైన సి.శ్రీకాంత్ అనే వ్యక్తిని కొన్నాళ్ల క్రితం గట్టిగా మందలించడమే కాకుండా స్థానికంగా గేట్ పుత్తూరులో నివశించకూడదని ఇరువర్గాలు నిర్ణయించుకున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 3వ తేదీన రాత్రి 7.00 గంటల ప్రాంతంలో ఆనంబట్టు రోడ్డులో శ్రీకాంత్‌పై ఎస్.శ్రీనివాసులు, ఎస్.సోమేష్, ఎస్.మధన్, ఎస్.మురళిలు దాడి చేసి కొట్టి, అతని మోటారు సైకిల్‌ను ధ్వంసం చేశారని చొక్కలింగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు కేసు నమోదు చేయకుండా, ఏమీ కాదు ఇంటికి వెళ్లండని చెప్పారని, ఆ మేరకు తాము ఇంటికి వెళ్లగా అక్కడే కాపు కాసి వున్న శ్రీనివాసులు తదితరులు తమపై దాడి చేసి తీవ్రంగా కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు.



గాయపడిన చొక్కలింగం, వాణి

దాడిలో చొక్కలింగం, ఎం.వాణిల తలలకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. పోలీసులు సకాలంలో పట్టించుకోకపోవడం వల్లే తమకు ఈ దుస్థితి కలిగిందని బాధితులు వాపోయారు. శనివారం రాత్రి ఇరు వర్గాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**పోలీసులపై మాజీ మంత్రి రోజా ఫైర్**
తమ పార్టీకి చెందిన వాణి, చొక్కలింగంలకు రక్తగాయాలైనా కూడా ఎందుకు కేసు పెట్టలేదని వైకాపాకు చెందిన పర్యాటక శాఖ మాజీ మంత్రి ఆర్.కె.రోజా పోలీసులపై ఫైర్ అయ్యారు. శనివారం మధ్యాహ్నం ఆమె పుత్తూరు అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సిఐ శేఖర్‌రెడ్డిని నిలదీశారు. ఈ నెల 3వ తేదీన రాత్రి ఫిర్యాదు చేసినపుడు పోలీసులు పట్టించుకోకపోవడం వల్ల అవతల వర్గం వారికి అవకాశం ఇచ్చినట్టయిందని ఆరోపించారు. తీరా దెబ్బలు తిన్న వారిని బయట కూర్చోపెట్టి, దెబ్బలు కొట్టిన వారిని లోపల కూర్చోబెట్టుకుని పోలీసులు మంతనాలు ఆడడంపై ఆమె మండిపడ్డారు. పాత కక్షలను పరిగణనలోనికి తీసుకుని ప్రస్తుతం గాయాలపాలైన బాధితుల ఫిర్యాదు మేరకు వారిని కొట్టిన వారిపై ఎందుకు కేసు పెట్టలేదని సిఐను ప్రశ్నించారు. దాంతో సిఐ సమాధానమిస్తూ తమకు పక్షపాతం లేదని, బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆమె వెంట మునిసిపల్ మాజీ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌లు ఎ.హరి, డి.జయప్రకాశ్ (చిట్టి) తదితరులున్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే వ్యర్థరహిత నగరంలా "చిత్తూరు"

- స్వచ్ఛత యాప్‌పై అవగాహన
- కమిషనర్ నరసింహప్రసాద్



చిత్తూరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:
ప్రజల భాగస్వామ్యంతోనే చిత్తూరు నగరాన్ని వ్యర్థరహితంగా మార్చగలమని కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. శనివారం గాంధీ విగ్రహం కూడలి వద్ద స్వచ్ఛసర్వేక్షన్ 2026లో భాగంగా జీరోవేస్ట్, తడి, పొడి వ్యర్థాల నిర్వహణ అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం, మానవహారం, ప్రతిజ్ఞ, సంతకాల సేకరణ కార్యక్రమాలను నిర్వహించారు. తడిపొడి వ్యర్థాలను వేరువేరుగా గ్రీన్, బ్లూ, రెడ్‌డస్ట్‌బిన్లలో వేయడం, అలాగే తడిపొడి వ్యర్థాలను సూచించేలా రంగులను కాన్వాస్‌పై ప్రదర్శించారు. కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛసర్వేక్షన్‌లో భాగంగా నగరంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నామని, తడిపొడి వ్యర్థాలను వేరుచేయడంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. గృహాల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను జీరోవేస్ట్ విధానంలో పూర్తిగా రీసైకిల్ చేయాలన్నారు. తడి వ్యర్థాలను ఎరువులుగా మార్చడం, పొడి వ్యర్థాలను రీసైకిల్ చేసి పునర్వినియోగించాలన్నారు. పారిశుధ్య సమస్యల పరిష్కారం కోసం స్వచ్ఛత యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని స్థానిక సమస్యలను యాప్‌లో అప్లోడ్ చేయడం ద్వారా సమస్యలు పరిష్కరించబడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ లోకేష్, సానిటరీ ఇన్స్పెక్టర్లు, వార్డు పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజల వినతులు త్వరితగతిన పరిష్కరించాలి

## - సిఎం చంద్రబాబునాయుడు



కుప్పం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త
వివిధ సమస్యలపై ప్రజలనుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు వచ్చే వినతులను అధికార యంత్రాంగం త్వరితగతిన పరిష్కరించాలని సిఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు. శనివారం ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ను సిఎం నిర్వహించారు. ఈ కార్యక్రమంకు కుప్పం నుంచి కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఆర్డీఒ విజయలక్ష్మి, డిఎస్పీ పార్థసారథి, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రజా వినతుల పరిష్కారంకు సంబంధించి అవి ఏయే దశల్లో ఉన్నాయి ఎంత నిర్దిష్టసమయంలో వాటిని పరిష్కరిస్తామనే విషయంగా అధికారులు గుర్తించి వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించినట్లు సమాచారం. సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించినట్లు తెలిసింది. అలాగే ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయడంతో పాటు అభివృద్ధిని ప్రజలకు విస్తృతంగా తెలిసేలా అధికారులు చొరవ చూపాలని సూచించినట్లు తెలిసింది. అనంతరం శాఖల వారీగా సిఎం చంద్రబాబు అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నట్లు సమాచారం.

# శిథిలావస్థితికు చేరుకున్న షాది మహల్



రామకుప్పం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త
మండల కేంద్రంలో నిర్మించిన షాది మహల్ శిథిలావస్థితికి చేరు కుంది.గత రెండు దశాబ్దాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ముస్లిం మైనార్టీలకు షాదీ మహల్ నిర్మించారు. కాల క్రమేణ వివాహాలు జరిగి వచ్చిన ఆదాయాన్ని మరమ్మతులకు ఇతర మౌలిక సదుపాయాలకు ఖర్చు చేశారు. గత పది సంవత్సరాలు క్రితం నుండి వివాహాలు జరకకపోవడంతో శిథిలావస్థితికు చేరుకున్నది.గత వైసిపి ప్రభుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజాప్రతినిధులు షాది మహల్ మరమ్మతులకు ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఇప్పటివరకు ఎలాంటి చర్యలకు పూనుకోలేదు. గత ఆరు నెలల క్రితం ఎస్ఐ వెంకట మోహన్ ,సిబ్బందితో కలిసి అసాంఘిక కార్యకలాపాలు గంజాయి, మత్తుపదార్థాలకు షాది మహల్ అడ్డగా మారిందని సమాచారంతో దాడులు నిర్వహించారు. ముస్లిం మైనార్టీల నిరుపేదల వివాహాలకు అనువుగా ఉన్న షాదీ మహల్ ను మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని ముస్లిం సోదరులు కోరుతున్నారు.

# టీటీడీ చైర్మన్‌ని తొలగించాలి

వడమాలపేట, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:



కళాంకితుడైన టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడుని వెంటనే తొలగించాలని మాజీ మంత్రి, వైసీపీ నాయకులు రోజా, కరుణాకర్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. శనివారం తిరుపతి జిల్లా వడమాలపేట మండలంలోని అప్పలాయగుంటలో వారు నిరసన, ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ క్యారెక్టర్ లేని వ్యక్తిని టీటీడీ చైర్మన్‌గా నియమించడమే పెద్ద తప్పు అని అతని గురించి వీడియోలు బయటపడ్డ తరువాత కూడా ఇంకా కొనసాగించడం అనేది మహా పాపం, అపచారమని ఆరోపించారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చేస్తున్న ఈ అపచారానికి ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని బి.ఆర్.నాయుడుని ఆ పదవి నుంచి తొలగించమని డిమాండ్ చేస్తున్నా ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందూ ధర్మాన్ని నమ్ముకున్న వాళ్ల వెంకటేశ్వర స్వామిని పూజించేవాళ్లు అందరూకూడా బాధపడుతున్నారన్నారు. వీడియోలు పబ్లిక్ అయిన తరువాతకూడా దించకపోవడం చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ చేస్తున్న తప్పు కాదా అని ప్రశ్నించారు. హిందువుల మనోభావాలు గౌరవిస్తామని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మౌనంగా ఉన్నారంటే వీళ్ళ జట్టు బి.ఆర్.నాయుడు చేతిలో ఉందా అని ప్రశ్నించారు. ఒక అమ్మాయిని 30 సంవత్సరాలుగా ఏ విధంగా టార్చర్‌పెట్టాడు ఏ విధంగా తన అధికార బలంతో అహంకారంతో ఎంత పని చేశాడో అన్ని చూసిన తరువాతకూడా ఎందుకు అతని చేత రాజీనామాచేయించలేదని చంద్రబాబును అడుగుతున్నామన్నారు. ఇప్పటికైనా చైర్మన్ తొలగించి చంద్రబాబు కొండమీద నించోని వెంకటేశ్వర స్వామి భక్తులకు సాష్టాంగ నమస్కారం చేసిక్షమాపణలు కోరాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజధానిపై జగన్‌కు ఎందుకు కక్ష..?

## -ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి

పెద్దపంజాణి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:
అమరావతి రాజధాని నగరంపై వైకాపా అధినేత వైఎస్ జగన్‌కు ఎందుకంత కక్ష అని ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి ప్రశ్నించారు.శనివారం పెద్దపంజాణిలో సర్పంచుల సన్మాన కార్యక్రమంతో పాటు ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న ఈ ఆటోలపంపిణీ కార్యక్రమంలో ఆయనపాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలో ఉన్న ఐదేళ్ళపాటు జగన్ మూడు రాజధానులని పేర్కొన్నారని నేడు మావిగన్ పాట అందుకున్నారని పేర్కొన్నారు. ఆంధ్రరాష్ట్రానికి అభినవ తుగ్లక్‌గా ఆయన మారారని పేర్కొన్నారు.పూటకోసాకు గంటకోమాటతో మాట్లాడే జగన్‌లాంటి నాయకులు అవసరమాఅని ప్రజలు ఆలోచించాలని కోరారు.రాజధాని అమరావతి నగరాన్ని మార్చడం ఇకఎవరితరమూ కాదని ఆయన పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రఅభివృద్ధి ప్రజలకు క్షేమం సాధ్యమౌతుందన్నారు.రాష్ట్రానికి రాజధానిగా 2014లోనే ప్రకటించి నిర్మాణపనులుసైతం మెదలుపెట్టారన్నారు.అప్పట్లో ప్రతిపక్షనేతగా ఉన్న జగన్‌కూడా రాజధానికి మద్దతు పలికారన్నారు.అయితే ఆయనఅధికారంలో వచ్చాక రాజధానినగరాన్ని పట్టించుకోక అటవీప్రాంతలా మార్చేశారని పేర్కొన్నారు.

# సిఐ ఆధ్వర్యంలో పల్లె నిద్ర కార్యక్రమం



పూతలపట్టు, ఏప్రిల్ 4, ప్రభాతవార్త
చిత్తూరు జిల్లా ఎస్పి తుషార్ దూది ఆదేశాలు మేరకు శుక్రవారం రాత్రి 11:30 గంటలకు పూతలపట్టు మండలం పి కొత్తకోట గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం సీఐ గోపి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధైర్యస్పర్శ, మహిళలు చిన్నపిల్లలు పట్ల జరిగే నేరాలు, సైబర్ క్రైమ్స్, మాదకద్రవ్యాల వినియోగం, దాని వలన కలిగే నష్టాలు, బాల్య వివాహాలు, రోడ్డు ప్రమాదాలు, సీసీ కెమెరాలు యొక్క ఉపయోగం, పోలీసులు ప్రజల మధ్య స్నేహపూర్వకమైన సంబంధాలు పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 100 మంది గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యంపై సిఎం ప్రత్యేక చొరవ



## - టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్

కుప్పం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త
కుప్పం ప్రజల ఆరోగ్యం పట్ల సిఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవ చూపుతున్నారని టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ పేర్కొనా న్నరు. శనివారం మండలంలోని గోనుగూరు, ఉర్ల ఓబనపల్లి గ్రామాల్లో ఆయన అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సిఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం మండలంలో ముప్పై మందికి 31లక్షల75062రూ.లు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైనట్లు తెలిపారు. రాష్ట్ర ంలో ఏ ఇతర ప్రాంతాల్లో లేని విధంగా కుప్పానికి సిఎం చంద్రబాబు సిఎంఆర్‌ఎఫ్ నిధులు అందిస్తున్నారన్నారు. ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం, పికె ఎం ఉడా చైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు ఆదేశాలతో లబ్దిదారుల ఇళ్ల వద్దకే నేరుగా వెళ్లి చెక్కులు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు కూడా తమకు మేలు చేస్తున్న సిఎం చంద్రబాబుకు మరింత మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో కనీసవేతనాలమండలి సభ్యుడు శరవణ, క్లస్టర్ ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, పంచాయతీ అధ్యక్షుడు కార్తీక్, బాబు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# రైతులకు రాయితీ టార్పాలిన్లు పంపిణీ



శాంతిపురం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త
మండలంలోని మొరసనపల్లి రైతు సేవా కేం ద్రంలో రైతులకు ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న టార్పాలిన్‌పట్టలను శనివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా కడ సభ్యురాలు సుగుణమ్మ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్ బాబు, పంచాయతీ కార్యదర్శి అశ్వత్ నారాయణ, విఎస్ఎ, రైతులు పాల్గొన్నారు.

# నూతన విద్యుత్ స్థంభాలు ఏర్పాటు



కుప్పం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త
మున్సిపాలిటీ పరిధి అనిమిగానిపల్లి గ్రామంలో రెస్కో డైరెక్టర్ ఆర్ముగం అధ ్వర్యంలో పాత ఇనుప స్థ ంభాల స్థానంలో నూతనంగా సిమెంట్ విద్యుత్ స్థంభాలను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ గ్రామంలో సుమారు నలభై ఏళ్లుగా పురాతన ఇనుప విద్యుత్ స్థ ంభాలు ఉండడంతో వాటితో తరచూ ప్రజలకు ఇబ్బందిగా ఉండేదన్నారు. దీంతో రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్‌తో చరి ్చంచడం జరిగిం దన్నారు. ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికె ఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు ఆదేశాలతో గ్రామంలో నూతనంగా సిమె ంట్ విద్యుత్ స్థంభాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు.



పెద్దపంజాణిలో ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న ఈ ఆటోల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

# వైసిపి నియోజకవర్గ మైనార్టీ ఉపాధ్యక్షుడిగా అలీ



రామకుప్పం ఏప్రిల్ 4 ప్రభాతవార్త
కుప్పం నియోజకవర్గ వైసిపి మైనార్టీ ఉపాధ్యక్షుడిగా రామకుప్పం మండలంలోని బల్ల గ్రామానికి చెందిన అలీని నియమిస్తూ ఎమ్మెల్సీ భరత్ ఓ ప్రకటనలో తెలిపారు. రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూముల కరుణాకర్ రెడ్డి ఆదేశాలతో అలీని ఎన్నుకున్నట్లు తెలిపారు.

# గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

రామకుప్పం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త



మండలంలోని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని జెడ్పిటిసి నితిన్ రాఘవరెడ్డి కోరారు. శనివారం జిల్లా జడ్పీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఈనెల 2 తేదీన సర్పంచుల ఐదు సంవత్సరాల పదవి కాలం ముగియడంతో గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఇన్చార్జిల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరిస్తూ అధికారులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. సమావేశంలో జడ్పీ చైర్మన్, సీఈఓ లు సమస్యల పరిష్కారానికి ఇన్చార్జ్ అధికారులకు ఆదేశిస్తామన్నారు.

# సీతారాముల కళ్యాణోత్సవంలో పాల్గొన్న గురజా చెన్నకేశవులు



గుడిపాల, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:
మండల కేంద్రంలోని రామభద్రపురం గ్రామంలో జరిగిన శ్రీసీతాసమేత శ్రీరామచంద్రస్వామి కళ్యాణోత్సవంలో జిజెఎం ట్రస్ట్ చైర్మెన్ గురజాల చెన్నకేశవులనాయుడు పాల్గొన్నారు. కాగా ఎంపిపి గోళ్లహరిప్రసాద్‌చౌదరి, తెలుగుయువత అధికార ప్రతినిధి హేమాద్రినాయుడులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి, దుశ్శాలువతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేసారు.

# అత్యుత్తమ పార్లమెంటేరియన్ బాబు జగ్జీవన్‌రామ్

## - ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్



చిత్తూరురూరల్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:
స్వతంత్ర భారతదేశంలో బాబు జగ్జీవన్‌రామ్ అత్యుత్తమ పార్లమెంటేరియర్ అని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ ఆయన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని నివాళులర్పిస్తూ ఒక ప్రకటనలో తెలిపారు. జగ్జీవన్ రామ్ సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, భారతదేశపు మొట్టమొదటి కార్మికశాఖ మంత్రిగా సుదీర్ఘకాలం సుమారు 30ఏళ్లకు పైగా కేంద్రక్యాబినేట్ మంత్రిగా పనిచేసిన గొప్ప పార్లమెంటేరియన్ అని గుర్తు చేసారు. అణగారిని వర్గాల హక్కుల కోసం సామాజికన్యాయం కోసం ఆయన జీవితాన్ని అంకితం చేసారని, నేటటి యువతకు ఆయన జీవితం స్ఫూర్తిగా నిలుస్తుందని, ఆయన చూపిన బాటలో నడవాలని పిలుపునిచ్చారు.

# పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

చిత్తూరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:
చిత్తూరుపట్టణం, మిట్టూరులోని ర్యాంకర్స్ స్కూల్‌నందు చిత్తూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరు నిత్యబాబు వార్షి క్రీడోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్‌నియమాలు, రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చిన్న వయస్సులోనే ట్రాఫిక్‌నియమాలను తెలుసుకొని, వాటిని అమలు చేయడం ఎంతో ముఖ్యమన్నారు. ముఖ్యంగా రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, జీబ్రా క్రాసింగ్ వినియోగించడం, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గౌరవించడం వంటి ప్రాథమిక నియమాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులఉ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించడం వల్ల ప్రాణాలను రక్షించుకోవచ్చునని, మద్యం సేవించి వాహన నడపడం అత్యంత ప్రమాదకరమని, ఇటువంటి చర్యలకు చట్టపరమైన శిక్షలు అనుభవించాల్సి వస్తుందని, మైనర్లు వాహనాలు నడపరాదని, తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తపడాలని సూచించారు. అలాగే విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల వల్ల కలిగే అనర్థాలు, నివారణ చర్యలు, అత్యవసర సమయంలో ఉపయోగించాల్సిన హెల్ప్‌లైన్ నంబర్లు తదితర వాటిపై అవగాహన కల్పించారు.

# ఉచిత మజ్జిగ కేంద్రం ఏర్పాటు




చిత్తూరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:
చిత్తూరుపట్టణం, కొంగారెడ్డిపల్లె కరుమారి అమ్మదేవాలయం ఎదురుగా ఉచిత మజ్జిగ కేంద్రంను ఏర్పాటు చేసినట్లు భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు మధుసూదనం తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువగా వుండడంతో పాదచారులకు, ఆటోడ్రైవర్లు తదితరులకు చల్లని మజ్జిగ అందజేసామని, త్వరలో పట్టణంలోని అన్ని కేంద్రాల్లో ఏర్పాటుచేయాలని సమితి కన్వీనర్లకు సూచించినట్లు పేర్కొన్నారు. ఈ సేవలలో ఉషానగర్‌కాలనీ సమితి, గిరింపేట సమితి సభ్యులు సత్యనారాయణ, సాయిక్రిష్ణ, ప్రభాకర్‌నాయుడు, శేషనారాయణ, శంకర్, శ్రీనివాసన్, కృష్ణమనాయుడు, మహిళా సభ్యులు శశికళ, కల్పన, సువర్ణ పాల్గొన్నారు.

# అమరావతికి కుప్పం తెలుగుతమ్ముళ్లు పయనం

కుప్పం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త
కుప్పం నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు అమరావతికి బయలుదేరి వెళ్లారు. ఆదివారం సిఎం చంద్రబాబునాయుడు కుప్పం నియోజకవర్గ నేతలతో సమావేశం నిర్వహించనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్న ం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబుతో పాటు నియోజకవర్గంలోని నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, కడ సభ్యులతో సిఎం సమావేశం జరుపుతారని తెలిసి ంది. దీంతో శనివారం రాత్రి నాయకులు అమరావతికి బయలుదేరారు.

# తిరుపతి డివిజన్

## చదువు తో పాటు వ్యక్తిగత వికాసం ముఖ్యం

డాక్టర్ నాదముని రెడ్డి...

**రేణిగుంట ఏప్రిల్ 4 ప్రభాతవార్త**



విద్యార్థులకు చదువుతోపాటు వ్యక్తిగత వికాసం అవసరమని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదముని రెడ్డి అన్నారు... రేణిగుంట మండలం కరకంబాడి అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఎంబీఏ ఎంసీఏ బీటెక్ విద్యార్థులకు ప్రముఖ సినీ నటుడు, చిత్ర దర్శకుడు ప్రదీప్ కుమార్ మై లైఫ్ మై ఛాయిస్ అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ చదువుతోపాటు సమయపాలనను విద్యార్థులు అనుసరించాలన్నారు. లక్ష య్ సాధన ధ్యేయంగా విద్యార్థులు ప్రగతి బాటలో పయనించాలన్నారు. తద్వారా విద్యార్థుల్లో మంచి లక్షణాలు రావడంతో పాటు జీవితంలో గొప్ప లక్ష్యాన్ని చేరాలన్న అభిలాష పెరుగుతుందన్నారు. విద్యార్థులు ఇతరులలోని మంచిని మార్గదర్శకంగా తీసుకొని స్వీయ శ్రమతో ఉన్నతి సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాలకు చెందిన వివిధ విభాగాతిపతులు, విద్యార్థినీ విద్యార్థులు, బోధన బోధ నేతర సిబ్బంది పాల్గొన్నారు..

## తుడా ఛైర్మన్‌ను ఆహ్వానించిన శ్రీపరశురామేశ్వర స్వామి దేవస్థాన అధికారులు

**తిరుపతి కలెక్టరేట్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త :**



తిరుపతి జిల్లా, ఏర్పేడు మండలం, గుడిమల్లం గ్రామంలో వెలసియున్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ పరశురామేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈ నెల 23 వ తేదీన పునరావర్తన జీర్ణోద్ధారణ అష్టబంధన మహా కుంభాభిషేకం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి రావాల్సిందిగా కోరుతూ ఆలయ అధికారులు తుడా ఛైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి ని ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహా కుంభాభిషేకానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను వారికి అందజేసి, కార్యక్రమ విశేషాలను వివరించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ని కోరారు.



## వడదెబ్బ సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

**కార్వేటినగరం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:**

వేసవికాలం కారణంగా ఎండలు అధికంగా ఉండడంతో ప్రజలందరూ వడదెబ్బ సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కార్వేటినగరం మండల తాహశీల్దార్ కె.నాగరాజు తెలిపారు. కార్వేటినగరం తాహశీల్దార్ కార్యాలయంలో శనివారం కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలో ప్రజలందరూ ప్రభుత్వం ఇచ్చిన సూచనలు, సలహాలు పాటించి వడదెబ్బసోకకుండా ఆరోగ్యంగా వుండాలన్నారు. ప్రభుత్వం వడదెబ్బ సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గూర్చి విడుదల చేసిన పాంప్లేట్లను అన్ని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు సచివాలయాలు, బస్టాండులలో అంటించాలన్నారు. మండలంలో వైద్యసిబ్బందిచే ప్రత్యేక క్యాంపులు నిర్వహించడంతో పాటు కూడలి ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసి అందరూ ఆరోగ్యంగా వుండేందుకు అధికారులంతా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ మధుసూధన్, కత్తెరపల్లి వైద్యాధికారిణి, డాక్టర్ వి.భువనేశ్వరి, డిప్యూటీ తాహశీల్దార్ లోకేష్, ఆర్ఐ నరసింహులు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.



## క్యాన్సర్‌పై ముందస్తు పోరాటం..

ఎస్వీయూలో పింక్ బస్ అవగాహన శిబిరం

**తిరుపతి విద్య, ఏప్రిల్ 4 ప్రభాత వార్త**

క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను ముందుగానే గుర్తిస్తే సమర్థవంతంగా నివారించవచ్చని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ తెలిపారు. స్విమ్స్ ఆధ్వర్యంలో ఎస్వీయూ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన పింక్ బస్ ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల ప్రకారం భౌతిక, మానసిక, సామాజిక, ఆధ్యాత్మికంగా సమతుల్యంగా ఉన్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఉద్యోగులు, పెన్షనర్లు ఈ ఉచిత పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్విమ్స్ ఆధ్వర్యంలో పింక్ బస్ ద్వారా క్యాన్సర్‌పై అవగాహన కల్పించడంతో పాటు, పలు సూపర్ స్పెషాలిటీ క్యాంపుల ద్వారా ఇతర వ్యాధుల నివారణపై కూడా ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే స్విమ్స్‌లో ప్రారంభించిన వెల్నెస్ సెంటర్ ద్వారా విద్యార్థులకు కౌన్సెలింగ్ అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్వీయూ వీసీ నరసింగరావు, రెక్టర్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, కార్డియాలజీ విభాగాధిపతి వనజాక్షమ్మ, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి కే నాగరాజ్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ శివశంకర్, హెల్త్ సెంటర్ వైద్యులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడొద్దు..

ఎస్వీయూలో అగ్గిరాజేసిన లా కాలేజీలు
పరీక్షలు వెంటనే వాయిదా వేయాలి!

**తిరుపతి విద్య ఏప్రిల్ 4 ప్రభాత వార్త**

ఎస్వీయూ పరిధిలో ఎల్ఎల్‌బి పరీక్షల వ్యవహారం తీవ్ర వివాదానికి దారి తీసింది. బార్ కౌన్సిల్ అనుమతి లేకుండా నడుస్తున్న లా కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులను పరీక్షలకు హాజరు చేయడం వారి భవిష్యత్తుతో నిరక్ష ్యంగా వ్యవహరించడమేనని విద్యార్థి సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. సోమవారం నుంచి నిర్వహించనున్న పరీక్షలను వెంటనే వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ లా విద్యార్థులతో కలిసి విద్యార్థి సంఘాల నేతలు ఎస్వీయూ పరిపాలనా భవనం ఎదుట భారీ నిరసన చేపట్టారు. అనుమతి లేని కళాశాలల్లో చదివిన విద్యార్థులను పరీక్షలకు కూర్చోబెట్టడం చట్టబద్ధమేనా? అని ప్రశ్నించిన నేతలు, ఇది విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడమేనని మండిపడ్డారు. పరిపాలనా నిరక్ష ్యం కారణంగా దాదాపు 240 మంది విద్యార్థులు తీవ్ర నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలు మార్లు వీసీ దృష్టికి సమస్యను తీసుకెళ్లినా స్పందన లేకపోవడం బాధాకరమని, ఇది యూనివర్సిటీ పాలనలో ఉన్న లోపాలను బట్టబయలు చేస్తోందని విమర్శించారు. సమస్యను పరిష్కరించకుండా పరీక్షలు నిర్వహించడం పూర్తిగా అన్యాయం, విద్యార్థుల హక్కుల పట్ల అవమానమని

## బాధ్యతలు తీసుకున్న విజయపురం ఎస్ఐ వెంకటసుబ్బయ్య

**విజయపురం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:**



విజయపురం మండల పోలీస్‌స్టేషన్‌లో శనివారం కొత్తగా వచ్చిన ఎస్ఐ వెంకట సుబ్బయ్య బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలపరిరక్షణకు కృషి చేస్తానని, అందుకు సంబంధించి స్థానిక ప్రజలు సహకారం అందించాలని కోరారు.

## మంచినీటి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు - ఎంపీడీవో

**విజయపురం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:**



మండల పరిధిలో వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో మంచినీటి సమస్య పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు దిశా నిర్దేశం చేశారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈ గిరీష్‌కుమార్‌తో పాటు పంచాయతీ కార్యదర్శులతో మంచినీటి అవసరాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మంచినీటిఎద్దడి తలెత్తకుండా అవసరమైన చర్యలుతీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు పిలుపునిచ్చారు. పంచాయతీల పరిధిలో అవసరమైన నిధులు లేనప్పటికీ మంచినీటి అవసరాలకు ప్రత్యామ్నాయంగా మండల, జిల్లా గ్రాంట్ నుంచి తెప్పించుకుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

## బి.ఆర్.నాయుడుని వెంటనే ఛైర్మన్ పదవి నుంచి తొలగించాలి

\- వైసీపీ మండల నాయకులు డిమాండ్



**విజయపురం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:**

బి.ఆర్.నాయుడుని వెంటనే టీటీడీ ఛైర్మన్ పదవి నుంచి తొలగించాలని విజయపురం మండల వైసీపీ నాయకులు డిమాండ్‌చేశారు. నగరి నియోజకవర్గం వైసీపీ పార్టీ సమన్వయకర్త మాజీమంత్రిరోజా ఆదేశాల మేరకు శనివారం మండలంలోని మహారాజపురం సమీపంలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో మండలవైసీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువుల పవిత్రదేవస్థానం టీటీడీఛైర్మన్‌గా ఉన్న బి.ఆర్.నాయుడు స్వామి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమల పవిత్రతను కాపాడేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని బి.ఆర్‌నాయుడుని టీటీడీ ఛైర్మన్ పదవి నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగరిఏఎంసీ మాజీ ఛైర్మన్ శోభ రామకృష్ణంరాజు, వైసీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి శేఖర్‌రాజు, మండల ఉపాధ్యక్షుడు సతీష్ యాదవ్, వైసీపీ పంచాయతీ రాజ్ రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌నాయుడు, రైతు విభాగ రాష్ట్ర కార్యదర్శి గుణశేఖర్‌రెడ్డి, స్థానిక నాయకులు ప్రసన్నకుమార్, జిల్లుదాసు, రమేష్‌రెడ్డి, గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ముగిసిన శ్రీరామ ఉత్సవాలు

**పుత్తూరు రూరల్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:**



పుత్తూరు పట్టణంలోని కాపువీధిలో వెలసిన శ్రీ కోదండరామస్వామి దేవాలయం(నోములగుడి)లో శ్రీరామనవమి ఉత్సవాలు పట్టాభిషేకంతో ముగిసింది. ఉదయం ఆలయంలోని మూల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరనలు చేశారు. సాయంత్రం విఘ్నేశ్వర పూజ కలశ స్థాపన ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అలాగే భక్తిశ్రద్ధలతో పట్టాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు .అనంతరం మంగళవాయిద్యాల నడుమ విద్యుత్ దీపాలంకరణతో స్వామి, అమ్మవార్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేసి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారికి, అమ్మవారికి మంగళ హారతులు ఇచ్చి పూజలు చేశారు.

## జిల్లాలో పులిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మొదటి స్థానం

**పులిచెర్ల, ఏప్రిల్ 4, ప్రభాతవార్త**






ఆరోగ్య సేవలలో పులిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించినట్లు వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి మాసంలో ఔట్ పేషెంట్స్ నమోదులో 1500 మంది లక్ష్యం కాగా 2693 మంది, ఇన్ పేషెంట్స్ నమోదులో 100 మందికి 41, ల్యాబ్ పరీక్షల్లో 3000 పరీక్షలకు గాను 3376, ఐయుడిల్లో 6 లక్ష్యం కాగా 7 మందికి సాధించి జిల్లా స్థాయి ర్యాంకింగ్స్‌లో మొదటి స్థానం సాధించడం ఎంతో సంతోషకరమని, ఈ విజయానికి కారణమైన సిబ్బంది అందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించాలనే తపనతో అందరూ శ్రమించారన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారం ముఖ్యమైనదన్నారు. ఇలాంటి విజయాలు బాధ్యతను మరింత పెంచుతాయని, భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో ప్రజలకు ఉత్తమ ఆరోగ్య సేవలు అందించడానికి కృషి చేస్తామని తెలియజేశారు.

## గ్రామపంచాయతీల ప్రత్యేక అధికారుల నియామకం

**పులిచెర్ల, ఏప్రిల్ 4, ప్రభాతవార్త**

మండలంలోని గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. రెడ్డివారి పల్లి, వెంకట దాసరి పల్లెలకు తహసీల్దార్‌ను కేటాయించగా, గడ్డం వారి పల్లె, నన్నూరు వారి పల్లె, పాతపేట, పోసం వారి పల్లి, పులిచెర్ల, రేణుమాకుల పల్లె, యల్లంకివారి పల్లెలకు ఎంపీడీవోను, 106 రామిరెడ్డిగారి పల్లి, కల్లూరు, కావేటిగారిపల్లి, పాలెం, రాజులపల్లి, రాయవారి పల్లెకు డిప్యూటీ ఎంపీడీవో, దేవళంపేట అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎంపీపీను, కమ్మపల్లి, మంగళంపేట, ముతుకువారిపల్లిలకు వ్యవసాయ శాఖ అధికారి, 102 ఈ రామిరెడ్డిగారిపల్లి, అయ్యవాండ్లపల్లి, బోడిరెడ్డిగారిపల్లి ఎంఈవో1ను, చల్లావారి పాలెం, దిగువ పాకాలవారిపల్లి, ఎర్రపాపిరెడ్డిగారిపల్లిలకు ఎంఈవో 2లను నియమించినట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గురువారంతో పంచాయతీ సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తి కావడంతో గ్రామ పంచాయతీల బాధ్యత ప్రత్యేక అధికారులకు అప్పగించారు.

## కేవీబీపురంలో చలివేంద్రం ఏర్పాటు

**కేవీబీ పురం, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:**



కేవీబీ పురంలో ఓం శక్తి ఆలయం ధర్మకర్త కరపారెడ్డి రామకృష్ణారెడ్డి చలివేంద్రాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా కేవీబీ పురం తహసీల్దార్ తనూజ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్‌లు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ పూజారి యానాదిశెట్టి, మాజీ సర్పంచ్ పంచి కరపారెడ్డి, భారతీ చెంగారెడ్డి, గ్రామ వీఆర్‌వో ముని భాస్కర్, వీఆర్‌ఏ మునస్వామి పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో వేగంపెంచాలి : ఎమ్మెల్యే ఆదిమూలం

**సత్యవేడు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:**



సత్యవేడు నియోజకవర్గ పరిధిలోని పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి, సంక్షేమ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలను ఆదుకోవాలని ఎమ్మెల్యే ఆదిమూలం అధికారులను కోరారు. శనివారం చిత్తూరులో జరిగిన జడ్పీ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ నియోజకవర్గంలోని సమస్యలపరిష్కారం కోరుతూ వివిధశాఖల అధికారులను ఎమ్మెల్యే కోరారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ నిబంధనలను పాటించడంలో కొందరు అధికారులు అలసత్వం వహిస్తున్నారని జడ్పీ సీఈవో దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారు. ప్రజాప్రతినిధుల సమన్వయంతో పనులు సాగేలా చూడాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై నియమావళిప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అలాగే పూర్తయిన పనుల ప్రారంభోత్సవాల్లో ప్రోటోకాల్ పాటించేలా ఆదేశాలు ఇవ్వాలని పీఆర్ఎస్ఈకి ఎమ్మెల్యే సూచించారు. కేవీబీ పురం మండలంలో రాయల చెరువు తెగిపోవడంతో నష్టపోయిన రైతులకు పరిహారం అందించే విషయంలో ఆలస్యం జరుగుతోందని జాయింట్ డైరెక్టర్(అగ్రికల్చర్)కు వివరించారు. ఈ అంశంపై అసెంబ్లీలో కూడా చర్చించామని, బాధితులకు త్వరగా న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇరిగేషన్ పనుల కేటాయింపులో పారదర్శకత ఉండాలని, టెండర్ల ప్రక్రియ ద్వారానే పనులు చేపట్టాలని ఎస్ఈ, ఈఈలకు ఆదిమూలంసూచించారు. నాగలాపురం మండలంలోని 9 గ్రామాలకు పైపులైన్ పనులు పూర్తయినందున, తక్షణమే తాగునీటి పనులను ప్రారంభించాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను కోరారు. వరదయ్యపాళెం, సత్యవేడు మండలాల్లో పూర్తయిన సబ్‌స్టేషన్లను ప్రారంభించి తగినంత మంది షిఫ్టు ఆపరేటర్లను నియమించాలని ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించారు. నియోజకవర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులను పూర్తి చేసివిద్యార్థులకు అందుబాటులోకి తేవాలని డీఈవోను కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పని చేసినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు.

## శివకుమార్‌కు అభినందనలు

**సత్యవేడు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:**



సత్యవేడు మండలంలో నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన శివకుమార్ నాయుడుకి సత్యవేడు కూరపాటి మురళీరెడ్డి శనివారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యవేడు మండలం తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి పూలమాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. మండలం అభివృద్ధి, ప్రజల సంక్షేమం, సామాజిక శ్రేయస్సు వైపుగా మరింత ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుతున్నానని తెలిపారు. కార్యక్రమంలో సునీల్‌జైన్, ప్రదీప్, పృథ్వీరాజ్, దిలీప్‌రాయల్, తులసి తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీ వైద్యాధికారిణిగా వెన్నెల సాహితి



**వడమాలపేట, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:**

వడమాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మండల వైద్యాధికారిణిగా వెన్నెల సాహితీ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న హర్షవర్ధన్ పీజీ కోర్సు కోసం సెలవుపై వెళ్లారు. దీంతో చంద్రగిరి ఇండియన్ కౌన్సిలింగ్ మెడికల్ రీసర్చ్ సెంటర్‌లో పని చేస్తున్న వైద్యాధికారిణి వెన్నెల సాహితీవడమాలపేటకు బదిలీ చేశారు. మరో డాక్టర్ సందీప్, సీహెచ్‌వో పురుషోత్తంరెడ్డి, సిబ్బంది స్వాగతం పలికారు.

## ప్రసన్న వెంకటేశ్వరునికి వైభవంగా గ్రామోత్సవం

**వడమాలపేట, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:**



అప్పలాయగుంటలో అభయహస్తంతో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారికి శనివారం సాయంత్రం ఊంజల్‌సేవ, గ్రామోత్సవాలు వైభవంగానిర్వహించారు. శనివారం వేకువ జామున సుప్రభాతసేవలో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు నిత్యకైంకర్యాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అలం కరణ అనంతరం భక్తుల ను దర్శనానికి అనుమ తించారు. సాయంత్రం ఉభయదేవేరులతో స్వామివారు ఊయలలో కొలువుదీరారు. అనం తరం తిరుచ్చి వాహనాన్ని అధిరోహిం చిన స్వామివారు పురవీధుల్లో విహరిం చారు. భక్తులు ధూపదీప నైవేద్యాలు స్వామివారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారి వేణుగోపాల్, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

● I, **ATHURU LAKSHMIPATHI** (Old Name), S/o.**A.GUNNAIAH**, resident of D.No: 4-8-258, Bommagunta, TIRUPATI (U) TIRUPATI - 517 501, AP. I have changed my name as **AETURU LAKSHMIPATHI** (New name)

వార్త CLASSIFIEDS వార్త

**CHANGE OF NAME**

★ I, **Dukakola Meerjan Vali** S/o Dukakola Nazeer, R/o H.No. 7-704/9/1, Janulla Street, Srikalahasti, have changed my name to Shaik Meerjan Vali S/o Shaik Nazeer. Henceforth, I shall be known as **Shaik Meerjan Vali** for all future purposes.

(Ro.No.326)

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే సత్తా చంద్రబాబుకే ఉంది

**- ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ**




వెంకటగిరి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే సత్తా ఒక సీఎం చంద్రబాబు నాయుదుకే ఉందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామ కృష్ణ తెలిపారు. రాజధానికి కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించి నందుకు వెంకటగిరి పట్టణ పుర వీధుల్లో ఎమ్మెల్యే రామకృష్ణ ఆధ్వ ర్యంలో కూటమి నాయకులు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర రాజధాని అమరావతికి చట్టబద్ధత సీఎం తీసుకువచ్చారని తెలిపారు. పార్లమెంటులో చట్టబద్ధత కల్పించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోం శాఖ మంత్రి అమిత్ షా తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రాన్ని మూడు రాజ్యాల పేరుతో జగన్మోహన్‌రెడ్డి అభివృద్ధి చేయకుండా నాశనం చేశారని విమర్శించారు. బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర రాజధానికి చట్టబద్ధత కల్పించడం ఆనందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ విశ్వనాథం, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, పటన్ పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ, నాయకులు నరసింహులు, చెంగారావు, జనసేన నాయకులు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## తిరుమలను అపవిత్రం చేసిన చైర్మన్ రాజీనామా చేయాలి




వెంకటగిరి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: పవిత్రమైన పుణ్యక్షేత్రాన్ని అపవిత్రం చేస్తున్న టీటీడీ బోర్డు చైర్మన్ బిఆర్ నాయుదు వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని వైసిపి నియోజకవర్గ సమన్వ యకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైసీపీ నేత పూజలు నిర్వహించారు. బిఆర్ నాయుడు స్వచ్ఛందంగా రాజీనామా చేయక పోతే అతన్ని పదో నుండి తొలగించాలని సీఎంని కోరారు. తిరుమలలో లడ్డు తయారీకి జంతువుల కొవ్వు వాడారని బిఆర్ నాయుడు ఆరోపణ చేసి విచారణ జరిపించిన నిరూపణ కాలేదన్నారు. బిఆర్ నాయుడుపై ఆధారాలతో అతను చేసిన తప్పులను చూపిస్తున్న అతనిపై చర్యలు తీసుకోపోవడం దారుణమన్నారు. వైసిపి నియోజకవర్గ పరిశీలకురాలు కోడూరు కల్పలత రెడ్డి మాట్లాడుతూ టిటిడి బోర్డు చైర్మన్ బిఆర్ నాయుదుని వెంటనే పదాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బాలయ్య, మున్సిపల్ విభాగం రాష్ట్ర కార్యదర్శి హరికృష్ణ, మాజీ కౌన్సిలర్లు కళ్యాణి, ధనియాలు రాదా, శ్రీనివాసులు, పూజా లక్ష్మి, శ్రీనివాసులు, వైసిపి మున్సిపల్ విభాగం ఉపాధ్యక్షుడు సతీష్ , నాయకులు దశరథరామిరెడ్డి, చిన్న, మురళి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## క్రిస్టియన్స్ కమ్యూనిటీకి శవపేటిక అందజేసిన రోటరీ క్లబ్



నాయుదుపేట ఏప్రిల్ 4 ప్రభాతవార్త : ట్రినిటీ హాస్పిటల్ వారి ఆర్థిక సహాయంతో నాయుదు పేట రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శనివారం నాయుదుపేట మండలంలోని క్రిస్టియన్ కమ్యూనిటీకి శవపేటిక అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఆదవరం నాగురయ్య మాట్లాడుతూ నాయుడుపేట చుట్టుపక్క ప్రాంతాలలో విద్య, వైద్యం ఒంటరి మహిళలకు ఆర్థిక అభివృద్ధికి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటి వరకు పేద విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశామన్నారు. అలాగే కొన్ని స్కూళ్లలో రేకుల షెడ్లు వేయించడం నీటి వసతి ఏర్పాటు చేశామని తెలిపారు. నిరుపేద విద్యార్థులకు చదువు నిమిత్తం ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో చర్చి పాస్టర్స్ వినతి మేరకు క్రిస్టియన్స్ కమ్యూనిటీకి శవపేటిక అందజేశామని తెలియజేశారు. దాతల సహకారంతో రోటరీ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విజయవంతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. చర్చి పాస్టర్స్ రోటరీ క్లబ్ అధ్యక్షులు ఆదవరం నాగురయ్యకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం వికలాంగుడు రామయ్యకు సిరి ఫర్నిచర్స్ అధినేత, రోటరీ క్లబ్ కార్యదర్శి పట్టా సుబ్రహ్మణ్యం ఆర్థిక సహాయంతో ట్రై సైకిల్ పంపిణీ చేశారు. పాస్టర్లు వినయ్ కుమార్, ఎస్ నిక్సన్, పీ ప్రవీణ్, రోటరీ క్లబ్ వ్యవస్థాపక సభ్యులు రామచంద్ర రెడ్డి, హెచ్ సుబ్రహ్మణ్యం, మునగాల కృష్ణారావు, ప్రమీల దేవి, కుసుమకుమారి, ఎన్ రామ్మోహన్రావు, ఉదయ శంకర్, శంకర్ లాల్,. హరిబాబు బి. కిరణ్ కుమార్, చంద్రశేఖర్ శేఖర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## తాగినీటి ఇక్కట్లు, పట్టించుకోని అధికారులు



నాయుడుపేట, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : మున్సిపాలిటీలోని ఐదవ వార్డు బట్టివిడత గిరిజన కాలనీలో గత నాలుగు రోజులుగా కాలనీవాసులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. దీనితో శనివారం గిరిజన కాలనీ మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. గత నాలుగు రోజులుగా తాము తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీకి తాగునీటిని సరఫరా చేసే పైప్ లైన్ పగిలిపోయి తాగునీరు వృధాగా పోతుందన్నారు. పైప్ లైన్ పగిలిపోవడంతో తమ కాలనీలో తాగునీరు సరఫరా కావడం లేదని తెలిపారు. మున్సిపల్ అధికారులకు తెలియజేసినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పైప్ లైన్‌కు మరమ్మతులు చేసి తమకు తాగునీరు అందించాలని వారు కోరారు.

## తిరుమల పవిత్రతను కాపాడాలి




సూళ్లూరుపేట, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలో శనివారం రాష్ట్ర వైసీపీ పిలుపు మేరకు ఎంపిపి అల్లూరు అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో తిరుమల పవిత్రతను కాపాడాలని, బీఆర్ నాయుడుకు టీటీడీ ఛైర్మన్‌గా కొనసాగే అర్హత లేదని, వెంటనే తొలగించాలని పార్కువీధిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. వైసీపీ శ్రేణులతో కలిసి పూజలు నిర్వహించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మంచి బుద్ధి ప్రసాదించాలని వెంకటేశ్వరస్వామిని వేడుకున్నారు. తిరుమల ప్రతిష్టను దెబ్బతీసే విధంగా బిఆర్ నాయుడు వ్యవహార శైలి ఉందని, అటువంటి వ్యక్తిని వెంటనే వెంటనే ఛైర్మన్ పదవి నుంచి తొలగించి తిరుమల పవిత్రతను కాపాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట మండలంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో అమరావతి సంబరాలు



సూళ్లూరుపేట, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: లోక్‌సభలో అమరావతి బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తూ ఏకగ్రీవ తీర్మానాలు చేయడంతో సూళ్లూరుపేటలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో శనివారం సంబరాలు చేసుకున్నారు. హోలీక్రాస్ జంక్షన్ నుంచి మోటార్‌బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొవ్వొత్తులతో పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ ఆకుతోట రమేష్, టిడిపి నేతలు పాకం వెంకటసుబ్బయ్య, కొక్కు శంకరయ్య, సెల్వం, బొమ్మన పళణి, కె. శ్రీధర్, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా నాగమోహన్




వెంకటగిరి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: న్యాయవాద సంఘ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం మహోత్సవం వైభవంగా జరిగింది. న్యాయవాద సంఘ అధ్యక్షులుగా దుప్పటి నాగమోహన్, ఉపాధ్యక్షు లుగా గుండు రాంప్రసాద్, కార్య దర్శిగా పాలూరు నరేంద్ర బాబు, ఉప కార్యదర్శిగా పాకనాటి కిషోర్, కోశాధికారిగా నక్కా అనుపమ, గ్రంథాలయ కార్యదర్శిగా లక్కామనేని కిషోర్ కుమార్, మహిళా న్యాయవాద ప్రతినిధిగా స్వప్న, కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా రొంటాల వాసు, నాగరాజు, లావణ్య, కృష్ణ ప్రియా, హరిప్రియలచే ఎన్నికల అధికారి సుంకర రాజేష్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పూర్వపు జనరల్ సెక్రెటరీ లక్కామనేని కోటేశ్వర రావు, సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గ సభ్యులకు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏవి రమణ తెలిపారు.

## సూళ్లూరుపేటలో ప్రజాదర్బార్



సూళ్లూరుపేట, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా శనివారం సూళ్లూరుపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజలు విచ్చేసి తమ సమస్యలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. అధికారులందరూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలందించాలని కోరారు. ప్రజలు తెలియజేసిన ప్రతి సమస్యను అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు.

## కెఎస్ఆర్ సతీమణిని చరవాణిలో పరామర్శించిన మాజీ సిఎం

పెళ్లకూరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: మండలంలోని కలవకూరు వద్దన్న ఇసుక రీచ్ వద్ద గత కొద్దిరోజుల క్రితం అక్రమ ఇసుక రవాణా జరుగుతుందని అడ్డుకున్న సంఘటనలో అక్కడ ఉన్న సిబ్బందిపై దాడి చేశారన్న కేసులో నెల్లూరు సెంట్రల్ జైల్లో మాజీ ఎన్డిడిసిబి చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి రిమాండ్ ఖైదీగా ఉన్న విషయం తెలిసిందే. ఈ విషయంలో శనివారం వైయస్సార్సీపి అధ్యక్షులు, మాజీ సీఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి సతీమణి కామిరెడ్డి పార్వతమ్మను చరవాణిలో పరామర్శించారు. పార్టీ ఎప్పుడు సత్తన్నకు అండగా ఉంటుందని ఎవరు అధైర్య పడవద్దని పార్వతమ్మకు ధైర్యం చెప్పారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరిని పార్టీ గుర్తుపెట్టుకుంటుందని రాబోయే మన వైసీపీ ప్రభుత్వంలో వారందరికీ సముచిత స్థానం ఉంటుందని భరోసా ఇచ్చారు.

## చెత్త ఇస్తే సరుకులు ఇస్తాం : ఎంపీడీవో



బాలాయపల్లి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: ఇళ్ల వద్ద ఉన్న చెత్తను పంచాయతీ సిబ్బందికిస్తే సరుకులు ఇస్తారని ఎంపీడీవో నారాయణ తెలిపారు. పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా చెత్త ఇస్తే సరుకులిస్తాం వినూత్న కార్యక్రమాన్ని మండల కేంద్రమైన బాలాయపల్లి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపిడిఓ డి. నారాయణ, మండల పార్టీ అధ్యక్షులు రావి సత్యం నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు రావి మస్తాన్ నాయుడులు పచ్చజెండా ఊపి లాంఛనంగా స్వచ్ఛరథను ప్రారంభించారు. ఇందులో భాగంగా రోజూ పొడి చెత్తను వేరు చేసి ఇస్తే దానికి బదులుగా ప్రజ లకు అవసరమైన నిత్యావసర సరకులు అందజేస్తున్నమని ఎంపిడిఓ తెలిపారు. ప్లాస్టిక్, కాగితాలు, గాజు సీసాలు, డబ్బాలు, ఇనుప వస్తువులు పునర్వినియోగం చేయగల చెత్త తీసుకొని, సబ్బులు డిటర్జెంట్ పౌడర్, బిస్కెట్లు, పెన్నులు, సంచులు, మొక్కల కుండీలు తదితర ఉపయోగకరమైన వస్తువులను బహుమతిగా అందజేస్తున్నారు. తహసిల్దార్ విజయలక్ష్మి మాట్లాడుతూ జనాభా పెరుగుదలతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు వినియోగం ఎక్కువైందని అన్నారు. మండల పార్టీ అధ్యక్షులు రావి సత్యం నాయుడు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ ప్రారంభోత్సవంలో ఏ.పి.ఓ. జ్యోతి, అడ్మినిస్ట్రేటివ్ డీజే ఆఫీసర్ వినీల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి లీలావతి, టిడిపి నేత చిత్తూరు ఈశ్వరయ్య, మాజీ సర్పంచ్ నల్లబోతుల మురళి తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణ సర్వేక్షణ్‌పై విద్యార్థులకు అవగాహన



సూళ్లూరుపేట, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26 కార్యక్రమంలో భాగంగా సూళ్లూరుపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సాయి విద్యానికేతన్, పార్కువీధి ఎంపిపి స్కూళ్లలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కె. చిన్నయ్య ఆధ్వర్యంలో విద్యార్థులతో స్వచ్ఛతపై డ్రామా స్కిట్లు, వేస్ట్ సెగ్రేగేషన్‌పై ఛార్ట్ తయారు చేసే పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా చెత్తను తడి చెత్త, పొడిచెత్త, హానికరంగా వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## లెవెలింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలి



నాయుడుపేట ఏప్రిల్ 4 ప్రభాతవార్త: మండలంలోని కాపులూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణ లెవెలింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు కాపులూరు చక్రపాణి ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీకి వినతి పత్రం అందజేశారు. శనివారం సూళ్లూరుపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నేత కాపులూరు చక్రపాణి, ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాపులూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యేకు ఆయన వివరించారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే వీలైనంత త్వరగా పాఠశాల ఆవరణ లెవెలింగ్ పనులకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

## గురుదేవుల బోధనలతోనే శాంతి, సౌఖ్యం

**-భగవద్గీతను అధ్యయనం చేయాలి-గీతామకరందం విశేష ప్రచారం జరగాలి**



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: గురుదేవుల బోధనలతోనే మనిషి జీవితంలో శాంతి, సౌఖ్యం సాధ్యమౌతుందని ఆశ్రమాలు ఆధ్యాత్మిక నిలయాలుగా విరాలజిల్లుతున్నాయని శనివారం జరిగిన సద్గురు సేవా ట్రస్టు వార్షికోత్స వంలో వక్తలు వివరించారు. ఆశ్రమంలో జరుగుతున్న వార్షికోత్స వాల్లో భాగంగా శనివారం సేవా ట్రస్టు వార్షికోత్స వం సందర్భంగా యోగా సాధన చేసిన వారికి ధృవీకరణ పత్రాలను అందించారు. ఆశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూనానందగిరి స్వామి పర్యవేక్షణలో ఉత్తరాధికారి సంపూర్ణానందగిరి స్వామి అధ్యక్షతన జరుగుతున్న సమావేశంలో పీఠాదిపతి అనుగ్రహ భాషణం చేస్తే సమాజంలో ఏదీ అయితే సత్యమే సత్యంగా ఉంటుందని వివరించారు. సమాజంలో చోటు చేసుకున్న రుగ్మతలకు ఆధ్యాత్మిక చింతన ఒక్కటే మార్గమన్నారు.

**గురుదేవుల బోధనలను ఆచరించాలి:**

ఈ సమావేశంలో కొక్కరచేడు శ్రీ శంకరానందాగిరి సేవాశ్రమం పీఠాధిపతి గురుచరణానందిగిరి స్వామి, నంబూరు కాశీవనాశ్రమాధిపతి యోగిని చంద్రకాళీప్రసాదమాతాజీలు మాట్లాడుతూ నేడు మన సమాజంలో రక రకాల రుగ్మతలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దానికి కారణం మనం మన జన్మ రహస్యాన్ని తెలుసుకోలేక పోతున్నాము. మనల్ని సృష్టించి,న భగవంతుని మరచి పోతున్నామన్నారు. అందుకే మన జన్మ రహస్యాన్ని తెలుసుకోవాలంటే గురుదేవుల బోదనలు ఎంతో అవసరం అన్నారు. ఆశ్రమాలు ఆధ్యాత్మిక నిలయాలుగా ఉన్నాయి. పూర్వం విద్యకోసం ఆశ్రమాలను ఆశ్రయించే వారు. కానీ నేడు సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్ది ఆశ్రమాలకు గుర్తింపు లేకుండా పోతుందన్నారు. నాడు మలయాళస్వామి అశ్రమం, అలాగే శుకబ్రహ్మాశ్రమంలో మహిళలకు సంస్కృత విద్యను అందించుటకు ప్రాధాన్యత ఇచ్చారు కాబట్టి నేడుమేమిద్దం ఇక్కడ మాట్లాడగల్లు తున్నామన్నారు. ఏ సమాజం అయితే మహిళలను గౌరవిస్తుందో గుర్తిస్తుందో ఆ సమాజం సుఖశాంతులతో ఉంటుంది. ఇంట్లో కూడా మనం అమ్మను ఆదరించాలి. ఆమె సేవలో మనగల్గాలి. అమ్మదీవెన కంటే మిం చింది లేదు. నేడుమనం నిత్యం ఎసిలో ఉంటాము. కానీ మనసులు కకావికలం, ఆందోళనలతో సతమమత మౌతుంటాము. దీనికి కారణం కర్మ సిద్ధాంతాలను తెలుసుకోకపోవటం అంతా మాది, నాది అని భ్రమలు ఉంటున్నారు. ఈ భ్రమనుంచి బయట పడాలి. మనల్ని భగవంతుడు పుట్టించిన రహస్యాన్ని తెలుసుకోవాలి. అని వివరించారు. అది గురుదేవుల సాంగత్యంలోనే సాధ్యమౌతుందన్నారు.

**గీతామకరందంకు విశేష ప్రచారం జరగాలి:**

శ్రీకాళహస్తిలో శుకబ్రహ్మాశ్రమ వ్యవస్థాపకులు విద్యాప్రకాశందగిరి స్వామి సుమారు 50సంవత్స రాల క్రితమే మానవజీవితం సుఖమయం కావాలంటే భగవద్గీత ఒక్కటే మార్గమని భావించారన్నారు. ఆయన ఆలోచనలతో భగవద్గీతను పండిత పామరులకు అర్థమయ్యేరీతిలో 'గీతా మకరందాన్ని' అందించా రన్నారు. దీనిని విశేష ప్రచారానికి 'గీతా యజ్ఞలను' నిర్వహిం చారన్నారు. ఒక్క తెలుగుభాషలోనే కాకుండా అన్ని భాషల్లో రచించి ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నారని వివరించారు. సమాజంలో శాంతి కలగాలంటే ప్రతి ఒక్కరు గీతా మకరందంలోని సారాంశాన్ని అర్థం చేసుకోవాలని స్వామినిలుసూచించారు. ఈ సందర్భంగా పలువురు ఆశ్రమ పీఠాధిపతులు తమ అనుగ్రహభాషణంలో ప్రతి ఒక్కరు మన జీవితాన్ని అంచనావేసుకోవాలన్నారు. ఈ శరీరం అశ్వాతం అనే వాస్తవాన్ని తెలుసుకోవాలన్నారు ఆత్మను పరమాత్మతో విలీనం చేయాలన్నారు. ఆధ్యాత్మిక చింతనతో జీవితాలను సుఖమయం చేసుకోవాలని సూచించారు.

## అంగన్వాడి పోస్టులకు దరఖాస్తు చేసుకోండి : సిడిపిఓ

బాలాయపల్లి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని సిడిపిఒ శంషాద్ బేగం తెలిపారు. బాలాయపల్లి, డక్కిలి, వెంకటగిరి మండలాల్లో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఈనెల ఆరో తేదీ నుండి 18వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పదో తరగతి పాసై 21 నుండి 35 సంవత్సరాల లోపల వయసు ఉండాలని తెలిపారు. పూర్తి వివరాలు కోసం సిడిపిఓ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

## అనుమానాస్పదంగా మోటార్ బైక్

వాకాడు, ఏఫ్రిల్ 4 ప్రభాతవార్త: మండల కేంద్రమైన వాకాడు ఆర్టీసీ డిపో సమీపంలో గత ఐదు రోజులుగా ఓ మోటారు బైక్ అనుమానాస్పదంగా వదిలి వెళ్ళడం కనిపిస్తుంది. స్థానికుల వివరాల మేరకు డిపో ప్రహరీ గోడ వద్ద ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఏపీ 39 కేఎం 2711 నంబరు కలిగిన ఎఫ్ జడ్ ఎస్ బైక్ ను వదిలి వెళ్ళారు. ఈ బైక్ ను ఐదు రోజులుగా ఎవ్వరూ తీసుకెళ్లడానికి రాకపోవడంతో సమీపంలోని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయమై వాకాడు పోలీసులు స్పందించి బైక్‌ను అదుపులోకి తీసుకుని విచారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## రన్ ఫర్ జీసస్ ర్యాలీకి విశేష స్పందన

వాకాడు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: వాకాడులోని సెయింట్ జేమ్స్ లూథరన్ చర్చిలో కెవిసి పాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దినకర్ బాబు ఆధ్వర్యంలో శనివారం రన్ ఫర్ జీసస్ ర్యాలీని సంఘకాపరి ఎన్. ప్రశాంత్ బాబు ప్రారంభించారు. కోట, వాకాడు, మండలాల మీదుగా సాగిన ఈ ర్యాలీకి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వాకాడు, కోట, చిట్టమూరు మండలాల క్రైస్తవ సంఘ కాపరులు, క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్థానిక సెయింట్ జేమ్స్ లూథరన్ చర్చి నుంచి విద్యానగర్ వరకు ర్యాలీని నిర్వహించారు. కెవిసి పాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దినకర్ బాబు మాట్లాడుతూ గుడ్ ఫ్రైడే, ఈస్టర్ ప్రాముఖ్యతను లోకానికి చాటి చెప్పడానికి ఈ రన్ ఫర్ జీసస్ ర్యాలీని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ ర్యాలీలో స్థానిక టీడీపీ నాయకుడు సన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి, క్రైస్తవ సంఘ నాయకులు జాలాది కిషోర్, పిడుగు ప్రవీణ్ కుమార్, తదితర క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

## చట్టబద్ధతతో అమరావతికి ఎదురు లేదు

**ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్**



పుత్తూరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : రాజధానిగా అమరావతి చట్టబద్ధతకు పార్లమెంట్ ఆమోదం తెలపడం వల్ల ఇక అమరావతికి ఎదురు లేదని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అన్నారు. అమరావతిని శాశ్వత రాజధానిగా గుర్తిస్తూ పార్లమెంట్‌లో బిల్లు పాసవడం పట్ల శనివారం ఆయన కొవ్వొత్తి వెలిగించి హర్షం వ్యక్తం చేశారు. రాజధానికి 33 వేల ఎకరాలు ఇచ్చిన వేలాది మంది రైతుల త్యాగాన్ని దేశంలోని వైసిపి తప్ప 40 రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వడం చారిత్రాత్మక సంఘటనగా ఆయన అభివర్ణించారు. అమరావతిని కేవలం రాజధానిగా చూడలేమని, తెలుగు జాతి ఆత్మ గౌరవమని పేర్కొన్నారు. గత పాలకులు మూడు రాజధానుల పేరిట మూడు ముక్కలాట ఆడడం వల్ల తెలుగు ప్రజలకు రాజధాని లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతికి చట్టబద్ధత రావడం వల్ల భవిష్యత్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో అమరావతిని ప్రపంచ నగరాలకు తలదన్నే రీతిలో అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

## స్విమ్స్‌లో అన్ని వయస్సుల వారికి ఆరోగ్య పరీక్షలు

**-అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు వినియోగించుకోవాలి**
**-స్విమ్స్, ఎస్వియూ సంచాలకులు, ఉపకులపతి**




తిరుపతి హెల్త్, ఏఫ్రిల్ 4 ప్రభాతవార్త: శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్)లో అన్ని వయస్సుల వారికి పూర్తి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నా మని, ఎస్. వి. యూనివర్శిటీ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, రిటైర్డ్ ఉద్యోగులు వీటిని వినియోగించుకుని ఆరోగ్యంగా ఉండాలని స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్. వి. కుమార్ కోరారు. తిరుపతిలోని ఎస్. వి. యూనివర్శిటీ హెల్త్ సెంటర్‌లో శనివారం స్విమ్స్ ఆధ్వర్యంలో పింక్‌బస్ ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డా ఆర్. వి. కుమార్ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల ప్రకారం మనిషి భౌతికంగా, మానసింగా, సామాజికంగా, ఆధ్యాత్మికంగా ఉన్నతంగా ఉన్నప్పుడు మాత్రమే పూర్తి ఆరోగ్యంగా ఉండగలుగుతారని చెప్పారు. సమగ్ర ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. స్విమ్స్ ఆధ్వర్యంలో పింక్‌బస్‌ల ద్వారా క్యాన్సర్ వ్యాధిపై, పలు సూపర్ స్పెషాలిటీ క్యాంపుల ద్వారా వివిధ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు వివరించారు. స్విమ్స్‌లోని సైకియాట్రీ విభాగంలో వెల్‌నెస్ సెంటర్ ప్రారంభించామని, వర్సిటీ విద్యార్థులకు ఇక్కడ కౌన్సెలింగ్ నిర్వహించడం ద్వారా వారు సరైన మార్గంలో పయనించేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. స్విమ్స్, ఎస్. వి. యూనివర్శిటీ పరస్పర సహకారంతో ఫ్రెండ్లీ స్పోర్ట్స్ మీట్స్, కల్చరల్ మీట్స్ తదితర కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఎస్. వి. యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ టి. నరసింగరావు మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం, రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం వల్ల ఆహారం కలుషిత మోతోందని, స్విమ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను, సూపర్‌స్పెషాలిటీ వైద్య శిబిరాన్ని ఉద్యోగులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్. వి. యూ. రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ తమ ఉద్యోగుల కోసం పింక్‌బస్ ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలను అందించిన స్విమ్స్ డైరెక్టర్‌కి ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం ఎస్. వి. యూ రెక్టార్ సి. హెచ్. అప్పారావు, స్విమ్స్ కార్డియాలజీ విభాగాధిపతి డా. వనజాక్షమ్మ, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డా. కె. నాగరాజ్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా. శివశంకర్ మాట్లాడుతూ ఎస్వియూ ఉద్యోగులకు పలు ఆరోగ్య సూచనలు అందజేశారు. అనంతరం ఎస్. వి. యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ టి. నరసింగరావు స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్. వి. కుమార్‌ని, కార్డియాలజీ విభాగాధిపతి డా. వనజాక్షమ్మ, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డా. కె. నాగరాజ్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా. శివశంకర్‌ను శాలువతో సన్మానించారు. ఎస్. వి. యూ. హెల్త్ సెంటర్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డా. పి. వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా. ప్రత్యూష, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పింక్‌బస్ నోడల్ ఆఫీసర్లు డా. భవాని, డా. శివ సంతోష్ కుమార్, హెల్త్ సెంటర్ జూనియర్ మెడికల్ ఆఫీసర్ డా. అలేఖ్య, పింక్‌బస్ మెడికల్ ఆఫీసర్లు డా. పద్మావతి, డా. హరిత, డా. లావణ్య, స్విమ్స్ ఎ.డి. (పి.ఆర్) వి. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణ ఉత్సవములు




కళ్యాణ ఉత్సవాన్ని నిర్వహిస్తున్న ఉమామహేశ్వర్ రెడ్డి. కళ్యాణం లో పాల్గొన్న కస్తూరి టిడిపి నాయకులు.

చిట్వేలి, ఏప్రిల్ 4, ప్రభాతవార్త:
శ్రీరామనవమి వేడుకలను తొమ్మిది రోజులు పాటు నిర్వహించడం హిందువుల సంప్రదాయం. ఈ క్రమంలో భాగంగా శనివారం చివరి రోజు కావడంతో మండల వ్యాప్తంగా పలుచోట్ల శ్రీ సీతారాముల కల్యాణ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక చిట్వేలి గ్రామంలోని గాజుల వీధి నందుగల శ్రీ సీతారాముల దేవస్థానం నందు వైసీపీ నాయకులు మాజీ ఉపసర్పంచ్ చౌడవరం ఉమామహేశ్వర్ రెడ్డి కుటుంబీకులు కళ్యాణ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు వైసిపి నాయకులు మలిశెట్టి వెంకటరమణ,చౌడవరం బాబు,పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు పాల్గొని కళ్యాణ ఉత్సవాన్ని తిలకించారు. రాజుకుంట గ్రామంలో ఉదయం కళ్యాణ ఉత్సవం, మధ్యాహ్నం అన్నదానం సాయంత్రం కళ్యాణ విగ్రహాలకు ఊరేగింపు కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున నిర్వహించారు. స్థానిక మండల పరిధిలోని తుమ్మ చెట్లపల్లి గ్రామంలో శ్రీ సీతారాముల కళ్యాణం ఉత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి కస్తూరి విశ్వనాథ నాయుడు, సాంస్కృతిక విభాగపు అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్,ప్రముఖ పారిశ్రామికవేత్త విశ్వేశ్వర నాయుడు పాల్గొని కళ్యాణాన్ని వీక్షించారు. వారికి మండల టిడిపి బాధ్యుడు కాకర్ల నాగార్జున ఘనంగా ఆహ్వానించి సత్కరించారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణ గ్రామాలలోనే సాధ్యమవుతుందని, గ్రామస్తుల మధ్య ప్రేమ అనురాగాలు మరింత బలపడతాయని వారు అన్నారు. కార్యక్రమంలో లారీ సుబ్బరాయుడు, బాలు రామాంజనేయులు నాయుడు, ప్రభుత్వ అదనపున్యాయవాది బాలాజీ, పెనగలూరు టిడిపి బాధ్యుడు నారాయణ రెడ్డి,ఓబులవారి పల్లి ప్రధాన కార్యదర్శి చప్పిడి బాబు, గుండయ్య యాదవ్,శివ శంకర్ రెడ్డి పెద్ద ఎత్తున

# దళిత మహిళ ఉద్యోగిపై జనసేన నాయకులు దాడి చేయడం దుర్మార్గమైన చర్య

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త
రైల్వే కోడూరు పట్టణంలోని పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న ఒక దళిత మహిళ ఉద్యోగిపై జనసేనకు సంబంధించిన తాతంశెట్టి నాగేంద్ర, అతని అనుచరులు పోలీసులు ఎదుటే దళిత మహిళ పైన దాడి చేయడం, కుల దూషణకు దిగడం, దుర్మార్గమైన చర్యగా దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సిపిఐ పార్టీకి చెందిన జ్యోతి చిన్నయ్య, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎస్సీ సెల్ కన్వీనర్ శాంతయ్యలు తీవ్రంగా ఖండించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు, సొంత పార్టీకి చెందిన నాయకులు ఒక మహిళపై దాడి చేస్తే వారిపై ఎందుకు చర్య తీసుకోలేదని,కూటమి ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరములవుతున్నా మహిళలకు రక్షణ కరువైందన్నారు. అదేవిధంగా జనసేన ఎమ్మెల్యే వ్యక్తిగత విషయాలు చట్టబద్ధంగా కోర్టులో చూసుకోవాలి తప్ప బహిరంగంగా మహిళపై దాడి చేయించడం ఎంతవరకు సమంజసమని స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరములు పూర్తయినప్పటికీ నేటికీ రాష్ట్రంలో మహిళలకు వివక్షతకు గురవుతున్నారని అర్ధరాత్రి సమయంలో మహిళలు ఒంటరిగా తిరిగే రోజులు ఎప్పుడు వస్తాయో అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో దళితులకు, దళిత మహిళలకు తీరని అన్యాయం జరుగుతున్నా పార్టీ పాలకులు చూసి చూడనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. డిప్యూటీ సీఎం పవన్ ప్రశ్నిస్తానంటూ మహిళలపై జరుగుతున్న దాడులను ఎందుకు ఖండించడం లేదని వారు సూటిగా ప్రశ్నించారు. ఈ



కార్యక్రమంలో పుల్లంపేట కాంగ్రెస్ నాయకులు రమేష్, బాల మురళీకృష్ణ, నాగేశ్వరరావులు స్థానిక పోలీస్ స్టేషన్లో బాధితురాలు హర్షవీణకు సంపూర్ణ మద్దతును ప్రకటించారు.

## నవోదయ ఎంట్రన్స్ జిల్లా టాపర్ కు అభినందన



ఉమ్మడి జిల్లా టాపర్ తనుష్ ను అభినందిస్తున్న హెడ్ టీచర్ రమణారెడ్డి

పెనగలూరు ఏప్రిల్ 4 ప్రభాతవార్త
రైల్వేకోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం నవోదయ ఎంట్రన్స్ పరీక్ష ఫలితాలలో సింగారెడ్డి పల్లి ఎలిమెంటరీ పాఠశాలలో పాఠశాలలో విద్యనిపుస్తున్న సోమింటి తనుష్ ఉమ్మడి కడప జిల్లా స్థాయిలో వందకు వంద మార్కులు సాధించి ప్రథమ శ్రేణి లో రాణించినట్లు ఆ పాఠశాల హెడ్ టీచర్ తల మంచి రమణారెడ్డి పేర్కొన్నారు ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో విద్యార్థి తల్లిదండ్రులు వేణుగోపాల్ ఇందిరమ్మ ల ఆధ్వర్యంలో ఘనంగా అభినందించారు. ప్రతి విద్యార్థి తనుష్ ను ఆదర్శంగా తీసుకొని బాగా విద్యనభ్యసించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో తనుష్ కుటుంబ సభ్యులు ఎస్ రాజేంద్ర రత్నమ్మ ఎం కృష్ణయ్య మారం రెడ్డి శివయ్య పి ఎం సి చైర్మన్ లింగం నరేష్ ఎం ఎం నిర్వహకురాలు బందెల రమణమ్మ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఆహార విశ్లేషణ పాఠ్యగ్రంథం గ్రంథావిష్కరణ

యూనివర్సిటీ(తిరుపతి),ఏప్రిల్ 4ప్రభాతవార్త:



తిరుపతి పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీలో ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగంలో ఆచార్యురాలు ఆచార్య జి. రజిత రచించిన "ఆహార విశ్లేషణ పాఠ్య గ్రంథం శాస్త్రీయ గ్రంథం ఆవిష్కరణ జరిగింది. పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ శనివారం ఆవిష్క రించారు. ఈ 250 పేజీల గ్రంథాన్ని ఫార్మా మెడ్ ప్రెస్ హైదరాబాద్ ప్రచురించింది.250 పేజీల ఈ గ్రంథం, ప్రధాన్ మంత్రి ఉన్నత విద్య అభియాన్ పథకం కింద, మల్టీడిసిప్లినరీ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీస్ కార్యక్రమంలో భాగంగా లభించిన పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆర్థిక సహాయంతో రూపొందించబడింది.రచయిత ప్రొఫెసర్ జి. రజిత గారు మాట్లాడుతూ,ఈ గ్రంథాన్ని రచించడంలో నా ప్రధాన ఉద్దేశ్యం విద్యార్థులకు ఆహార విశ్లేషణపై సమగ్ర, సులభ మరియు వ్యవస్థీకృత అవగాహన కల్పించడం. సిద్ధాంతం మరియు ప్రయోగిక అంశాలను సమన్వయం చేస్తూ, ఆధునిక విశ్లేషణ పద్ధతులను సులభంగా అర్థమయ్యే విధంగా అందించడానికి ప్రయత్నించాను.

## స్విమ్స్‌లో పలు తాత్కాలిక పోస్టులకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

తిరుపతి హెల్త్, ఏప్రిల్ 4, ప్రభాతవార్త
శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో "ఎవాల్యూషన్ ఆఫ్ క్యాన్సర్ అవేర్‌నెస్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్ యాన్ ఇంప్లిమెంటేషన్ రీసెర్చ్ ఇన్ తిరుపతి డిస్ట్రిక్ట్, ఆంధ్రప్రదేశ్ అనే ఎం.ఆర్.సి ప్రాజెక్టు లో తాత్కాలిక ప్రాదిపదికన పలు పోస్టుల కోసం ఏప్రిల్ 15వ, 16వ తేదీలలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ లు నిర్వహించనున్నట్లు స్విమ్స్ రిజిస్ట్రార్ గారు శనివారం ఒక ప్రకటనలో తెలియ జేశారు. మెడికల్ ఆఫీసర్ 1, స్టాఫ్ నర్సు 1, ఎ.ఎన్.ఎం 1, మామోగ్రాఫీ టెక్నీషియన్ 1, కార్డియో వాస్క్యులర్ టెక్నీషియన్ గ్రేడ్॥ 1, డేటా ఎంట్రీ ఆపరేటర్ 1, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ 1, మెడికో సోషల్ వర్కర్ 1,ఎలక్ట్రీషియన్ 1,డ్రైవర్1నోటిఫికేషన్, దరఖాస్తు ఫారం, ఇతర వివరాల కోసం హెచ్‌టిటి పిఎస్://స్విమ్స్ టిపిటి.ఏపి.ఎన్ఐసి.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో తెలిపారు.

## మిట్టపల్లూరులో కొవ్వొత్తుల నీరాజనం

పుత్తూరు రూరల్, ఏప్రిల్ 4 ప్రభాతవార్త:



అమరావతి రాజధానిగా పార్లమెంట్‌లో బిల్లు పాసైన సందర్భంగా చిత్తూరు పార్లమెంట్ పరిధిలోని నగరి నియోజకవర్గం, పుత్తూరు మున్సిపాలిటీ 1వ వార్డు మిట్టపల్లూరు గ్రామంలో కొవ్వొత్తులు వెలిగించి అమరావతికి మద్దతుగా చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు షణ్ముగంరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు కోట్ల ఆంధ్రుల కల అయిన అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా చూడడం ప్రతి ఒక్కరి ఆకాంక్ష. అమరావతి అనేదికేవలం పేరు మాత్రమే కాదు అది రాష్ట్ర అభివృద్ధికి మూల స్తంభం అని పేర్కొన్నారు. అమరావతి రైతుల త్యాగం ఈ రోజు ఫలించిందన్నారు. భారతదేశంలోని రాజకీయ పార్టీలన్నీ అమరావతికి మద్దతు తెలుపుతున్న ఈ సమయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాత్రం ప్రజల అభిప్రాయాలను విస్మరించడం దురదృష్టకరమని విమర్శించారు. ప్రజల ఆకాంక్షలను గౌరవించి అమరావతి అభివృద్ధికి సహకరించని వైసీపీ పార్టీని రాష్ట్రం నుంచి బహిష్కరించాలని ప్రజలకు విన్నవించారు. అమరావతి నిర్మాణం అంటే అదికేవలం రాజధాని నిర్మాణం కాదు ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ నిర్మాణమన్నారు. పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, యువతకు భవిష్యత్ అమరావతితోనే సాధ్యమని స్పష్టం చేశారు. అనంతరం నాయకులు మణి, కుప్పారెడ్డి, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొని అమరావతికి తమ పూర్తి మద్దతు తెలిపారు.

## నేటి నుంచి "సూర్యఘర్ ఉత్సవ్"



**తిరుపతి,ఏప్రిల్ 4(ప్రభాతవార్త:** జిల్లాల్లో నేటి నుండి "సూర్యఘర్ ఉత్సవ్" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎస్‌పిడిసిఎల్ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. కార్పొరేట్ కార్యాలయంలో శనివారం రూఫ్ టాప్ సోలార్ అంశంపై సంస్థ అధికారులు, సోలార్ ఏజెన్సీల ప్రతినిధులతో సిఎండి శివశంకర్ లోతేటి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుండి ఏప్రిల్ 14వ తేదీ వరకు రూఫ్ టాప్ సోలార్ ను ప్రోత్సహించేందుకు వీలుగా సూర్యఘర్ ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రూఫ్ టాప్ సోలార్ పనుల్లో సంస్థ అధికారులు, సిబ్బంది, ఏజెన్సీల నిర్లక్ష్యాన్ని సహించబోమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి. అయుబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ హెచ్ఆర్ డి) కె. గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణా దేవి, యం. ఉమాపతి, కె. ఆదిశేషయ్య, ఆర్. పద్మ, సిహెచ్ రామచంద్ర రావు, కె. సంపత్ కుమార్, ఎస్. రమణ, జనరల్ మేనేజర్లు ,ఏజెన్సీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# 20 ఏళ్ల పాత జిమ్‌తోనే విద్యార్థుల భవిష్యత్తా?

తిరుపతి విద్య ఏప్రిల్ 4 ప్రభాత వార్త

నిరక్ష ్యంపై ఎస్వీయూ అధికారులపై జేఏసీ ఫైర్



ఎస్వీ యూనివర్సిటీలో విద్యార్థుల ఆరోగ్యం, శారీరక దృఢత్వం గురించి బాధ్యత వహించాల్సిన వ్యవస్థే నిర్లక్ష్యానికి ప్రతీకగా మారింది.దశాబ్దాలుగా శిథిలావస్థలో ఉన్న జిమ్,యూనివర్సిటీ పాలనలోని లోపాలను బట్టబయలు చేస్తోంది. ఇరవై సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన పరికరాలే ఇప్పటికీ మూలన పడివుండటం, అవి పూర్తిగా పనికిరాని స్థితిలో ఉండటం ... ఇవన్నీ కలిపి చూస్తే ఇది జిమ్ కాదు, నిరక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం.విద్యార్థులు క్రీడారంగంలో రాణించాలని ఆశించే యూనివర్సిటీ, కనీస వ్యాయామ సదుపాయాలు కూడా కల్పించలేకపోవడం తీవ్రంగా ఆందోళన కలిగించే విషయం. ముఖ్యంగా బీపీఎడ్ విభాగం ఉన్నప్పటికీ, పరిస్థితి ఇలా ఉండటం మరింత విచారకరం. బాధ్యత వహించాల్సిన అధికారులు చూస్తూ చూడనట్టుగా వ్యవహరించడం ప్రశ్నార్థకంగా మారింది.ఈ పరిస్థితిపై ఏపీ స్టూడెంట్స్ జేఏసీ గళమెత్తడం సహజమే. గార్లపాటి శ్రీధర్ నేతృత్వంలో విద్యార్థులు వినతిపత్రం అందజేయడం, సమస్య తీవ్రతను తెలియజేస్తోంది."విద్యార్థుల ఆరోగ్యం ముఖ్యం కాదా?" అనే ప్రశ్న ఇప్పుడు యూనివర్సిటీ అధికారుల ముందు నిలిచింది. ప్రైవేట్ జిమ్‌లలో ఉన్న ఆధునిక సదుపాయాలు చూసి విద్యార్థులు ఆశపడాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరం.రూసా నిధులు ఉన్నా, అవకాశాలు ఉన్నా, సంకల్పం లేకపోతే అభివృద్ధి సాధ్యం కాదనే విషయం ఈ ఘటన మళ్లీ గుర్తు చేస్తోంది. విద్యార్థుల భవిష్యత్తు, ఆరోగ్యం వంటి కీలక అంశాలను నిరక్ష ్యం చేయడం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదు.అయితే, విద్యార్థుల ఆందోళనపై స్పందించిన యూనివర్సిటీ అధికారులు త్వరలోనే జిమ్‌ను ఆధునికీకరించి అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇవ్వడం కొంత ఊరటనిస్తోంది. కానీ ఇలాంటి హామీలు కాగితాలకే పరిమితం కాకుండా, కార్యరూపం దాల్చాలి. లేదంటే విద్యార్థుల ఆగ్రహం మరింత ముదురే అవకాశం ఉంది.ఇప్పటికైనా ఎస్వీయూ అధికారులు మేల్కొని, విద్యార్థుల అవసరాలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకుంటారా? లేక మరోసారి హామీలకే పరిమితం అవుతారా? అన్నది వేచి చూడాలి.

# తిరుపతి డివిజన్

## ఫాస్ట్ ఫుడ్ మోజు విడిచితేనే ఆరోగ్య భవిష్యత్తు సాధ్యం

ఎస్.జి.ఎస్ కళాశాలలో అవగాహన

తిరుపతి విద్య, ఏప్రిల్ 4 ప్రభాత వార్త



విద్యార్థుల్లో పెరుగుతున్న ఫాస్ట్ ఫుడ్ అలవాట్లపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ఆరోగ్యకరమైన జీవనశైలిపై చైతన్యం కల్పించే ఉద్దేశంతో ఎస్.జి.ఎస్ ఆర్ట్స్ కళాశాలలో పోషకాహారాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫుడ్ సైన్స్ టెక్నాలజీ, టూరిజం ట్రావెల్ మేనేజ్మెంట్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆరోగ్యంపై బాధ్యతను మరింత పెంచింది.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయుర్వేద వైద్య నిపుణులు డా. జ్యోతి కుమార్ మాట్లాడుతూ, ఆధునిక జీవనశైలిలో మారుతున్న ఆహారపు అలవాట్లు అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నాయని హెచ్చరించారు. ముఖ్యంగా వేసవి కాలంలో శరీరానికి తగినంత ద్రవాలు, శరీరాన్ని చల్లగా ఉంచే సహజ పోషకాహారాన్ని తీసుకోవడం అత్యవసరమని సూచించారు.కళాశాల ప్రిన్సిపల్ డా. బి. సత్యనారాయణ మాట్లాడుతూ, పోషకాహారం విద్యార్థుల శారీరక ఆరోగ్యంతో పాటు మేధో వికాసం, విద్యా ప్రతిభ పెంపుదలకు కూడా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఫాస్ట్ ఫుడ్ అలవాట్లు భవిష్యత్తులో తీవ్రమైన అనారోగ్య సమస్యలకు దారితీసే అవకాశముందని హెచ్చరిస్తూ, సమతుల్య ఆహారపు అలవాట్లు అలవరచుకోవాలని పిలుపునిచ్చారు.వైస్ ప్రిన్సిపల్ డా. ఎం. మాదన్న మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకొని, క్రమబద్ధమైన ఆహారపు అలవాట్లను అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు.కార్యక్రమంలో విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకున్నారు.

## ఐడీటీ ఫలితాలు విడుదల..

తిరుపతి విద్య ఏప్రిల్ 4 ప్రభాత వార్త
భారతీయ దూరసంచార వినియామక ప్రాధికార ఆంధ్రప్రదేశ్ ఎల్ఎస్ఏ పరిధిలో నిర్వహించిన ఇండిపెండెంట్ డ్రైవ్ టెస్ట్ (ఐడీటీ) ఫలితాలు విడుదలయ్యాయి. ఫిబ్రవరి 17 నుంచి 19 వరకు కడప, పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన ఈ పరీక్షల్లో 2జి నుంచి 5జి వరకు నెట్‌వర్క్ పనితీరును అంచనా వేశారు.395.6 కి.మీ డ్రైవ్ టెస్ట్, 5.1 కి.మీ వాక్ టెస్ట్, 8 హాట్‌స్పాట్ ప్రాంతాల్లో పరీక్షలు నిర్వహించగా, ఎయిర్టెల్ (99.59శాతం ), జియో (99.17 శాతం ), వీఐఎల్ (96.36 శాతం ), బీఎస్ఎన్ఎల్ (93.74 శాతం ) కాల్ సెటప్ సక్సెస్ రేట్లు నమోదు చేశాయి.వివరమైన నివేదిక ట్రాయ్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని అధికారులు తెలిపారు.

## పట్టుదల ఉంటే వయస్సు కేవలం సంఖ్య మాత్రమే

67ఏళ్లలో పీహెచ్‌డీ సాధించిన వేద కంప్లీ



తిరుపతి విద్య ఏప్రిల్ 4 ప్రభాత వార్త
తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో అరుదైన విద్యా సాధన చోటుచేసుకుంది. బెంగుళూరు బళ్లారికి చెందిన వేద కంప్లీ 67 ఏళ్ల వయస్సులో పీహెచ్‌డీ పట్టా సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ద్వైవ్రత వేదాంత విభాగంలో ప్రొఫెసర్ శంకరనారాయణ అడిగ పర్య వేక్షణలో శ్రీమద్భగవద్గీతలో వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై సంస్కృతం లో పరిశోధన పూర్తి చేసి ఆమె డాక్టరేట్ పొందారు.సంస్కృతంపై ఉన్న ఆసక్తి, పట్టుదలతో ఈ వయస్సులో పీహెచ్‌డీ సాధించడం విశేషమని అధ్యాపకులు ప్రశంసించారు. చదువుకు వయస్సు అడ్డంకి కాదని, సంకల్పం ఉంటే ఏదైనా సాధ్యమేనని వేద కంప్లీ తన కృషితో నిరూపించారని వర్సిటీ అధికారులు అభినందించారు.

## డ్రగ్స్‌కు నో చెప్పండి.. ఆరోగ్యకర భవిష్యత్తును ఆహ్వానించండి



తిరుపతి విద్య ఏప్రిల్ 4 ప్రభాత వార్త
డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ సాధన దిశగా అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి జి. రాజశేఖర్ రెడ్డి తెలిపారు. డ్రగ్స్ నిర్మూలనపై చైతన్యం కల్పించేందుకు తిరుపతి నుంచి విశాఖపట్నం వరకు 1000 కిలోమీటర్ల సైకిల్ యాత్రను ఈ నెల 6వ తేదీ (సోమవారం) ఉదయం 8.30 గంటలకు ఎస్వీ యూనివర్సిటీ ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్లు ప్రారంభించనున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు తమ తమ కళాశాలల నుండి ఆన్‌లైన్ ద్వారా తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన సూచించారు.

## జనవాణికి 52 వినతులు...

సమస్యల పరిష్కారానికి చర్యలు

తిరుపతి విద్య ఏప్రిల్ 4 ప్రభాత వార్త




ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శనివారం తన కార్యాలయంలో నిర్వహించిన జనవాణి కార్యక్రమానికి మొత్తం 52 వినతులు అందాయి. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు.విభాగాల వారీగా కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగానికి 11, రెవెన్యూ విభాగానికి 13, కలెక్టర్ కార్యాలయానికి 1, కార్పొరేషన్ ప్రణాళిక విభాగానికి 1, టీటీడీకి 2, కార్పొరేషన్ కమిషనర్‌కు 11, హెల్త్ ఆఫీసర్‌కు 2, సహాయ కమిషనర్‌కు 8, పోలీసు శాఖకు 3, స్కిల్ డెవలప్మెంట్‌కు 2 వినతులు వచ్చినట్లు తెలిపారు.ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించేందుకు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ప్రారంభించిన జనవాణి కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి జనవాణి ద్వారా పరిష్కారానికి తీసుకురావాలని నాయకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డా. పసుపులేటి హరిప్రసాద్, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు...

సదుపాయాలపై ఆరా.. విద్యార్థులతో భోజనం
ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి విద్య, ఏప్రిల్ 4 ప్రభాత వార్త




జీవకోనలోని సత్యనారాయణపురం జెడ్‌పి హైస్కూల్‌ను శనివారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సందర్శించి పాఠశాల పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య, హాజరు వివరాలు అడిగి తెలుసుకుని, వారికి అందిస్తున్న పౌష్టికాహారాన్ని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్కూల్‌కు గ్రౌండ్ అవసరమని, ల్యాబ్‌లో తగిన పరికరాలు లేవని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, అవసరమైన సదుపాయాలను త్వరలోనే ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.మధ్యాహ్న భోజనానికి వినియోగించే నిత్యావసరాలను కూడా పరిశీలించిన ఎమ్మెల్యే, విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. శనివారం ప్రత్యేకంగా వడ్డించిన బెల్లం పొంగల్ రుచిగా ఉందని విద్యార్థులు తెలిపారు.విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. ఫోన్, సోషల్ మీడియా వినియోగాన్ని తగ్గించి చదువుపై దృష్టి పెట్టాలని ఆయన హితవు పలికారు.ఈ కార్యక్రమంలో డీఈఓ కె వి ఎన్ కుమార్, ఎంఈఓ బాలాజీ,భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## శ్రీ గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో రోబోటిక్ ఎక్స్పో



తిరుపతి క్రీడ, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: తిరుపతిలోని కె.టీ.రోడ్డులో ఉన్న శ్రీ గీతాంజలి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శనివారం రోబోటిక్ ఎక్స్పో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శాప్ చైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ ప్రపంచం ఏఐ సాంకేతికత వైపు పరుగులు తీస్తున్న నేటి రోజుల్లో విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచి రోబోటిక్ సాంకేతికతపై శిక్షణ ఇస్తున్న శ్రీ గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఎండి డా. నెల్లూరి మాధవిని అభినందించారు. విద్యార్థులు రోబోటిక్ సాంకేతికతపై పూర్తి పట్టు సాధించి భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే రోబోట్లను తయారుచేసే స్థాయికి ఎదగాలని సూచించారు. మన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆలోచనలకు అనుగుణంగా విద్యను అందిస్తున్నందుకు పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి విచేసిని మరొక ముఖ్య అతిథి టిడిపి రాష్ట్ర సెక్రటరీ సూర సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలువేస్తూ విద్యార్థులు రోబోటిక్ సాంకేతికతను అందిపుచ్చుకొని భవిష్యత్ సైంటిస్టులుగా ఎదగడానికి పాఠశాల స్థాయినుంచే కృషి చేస్తున్న శ్రీ గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ యాజమాన్యాన్ని కీర్తించారు. శ్రీ గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఎండి డా. నెల్లూరి మాధవి మాట్లాడుతూ అన్నీ రంగాలలో రోబోటిక్స్ వినియోగం పెరుగుతున్న నేటి రోజుల్లో విద్యార్థి దశ నుండే వారికి రోబోటిక్ సాంకేతికతను పరిచయం చేయడం ద్వారా భవిష్యత్తులో ఈ రంగంలో మరింతగా రాణించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన వివిధ విభాగాలకు చెందిన రోబోట్లు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శ్రీ గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ సురేంద్ర, డీన్ భాస్కర రావు,రోబోటెక్స్ సౌత్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మణికంతన్, రీజనల్ మేనేజర్ చరణ్, ప్రిన్సిపల్స్ రమణ, నాగరాజు, దీప, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వినియోగం తగ్గించండి




శ్రీకాళహస్తి రూరల్ ఏప్రిల్ 4 ప్రభాతవార్త : ప్రజా సాధికారిక ట్రస్ట్ ఆధ్వర్యంలో, అమాక్స్ వారి సహకారంతో శ్రీకాళహస్తి మండలం ,వేడం పంచాయతీ ,ఎస్సీ కాలనీలో"భూమి హిత" పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంపై గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భూమిహితులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ అవసరం, చెట్ల పెంపకం, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు వంటి అంశాలపై వారికి వివరంగా అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ప్రజా సాధికారిక ట్రస్ట్ అధ్యక్షులు బాలాజీ నాయక్, కోఆర్డినేటర్ వెంకమ్మ, ఆర్గనైజర్ కళ్యాణి పాల్గొన్నారు.కార్యక్రమం ద్వారా గ్రామ స్థాయిలో పర్యావరణాన్ని సంరక్షించేందుకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

## మహిళల భద్రతపై శక్తి టీం అవగాహన

తిరుపతి,ఏప్రిల్ 4ప్రభాతవార్త: శక్తి యాప్, సైబర్ నేరాలు, అత్యవసర సేవలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మహిళ శక్తిటీమ్ పోలీసులు కార్యక్రమాలు చేపడుతున్నారు. బస్టాండ్, రైల్వే స్టేషన్, మార్కెట్ ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్‌గా తీసుకున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాల మేరకు మహిళా డిఎస్పి శ్రీమతి శ్రీలత ఆధ్వర్యంలో శక్తి టీం పోలీస్ జిల్లాలోని పలు ప్రాంతాలలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

## ముగిసిన రాముల ఊంజల్‌సేవ

తిరుపతి,ఏప్రిల్ 4ప్రభాతవార్త: తిరుపతి పెద్దకాపు వీధిలో వెలసిన శ్రీరామ భజన మందిరం సాయంత్రం సీతారాములకు ఊంజల సేవ కడు రమణీయంగా నిర్వహించారు. స్థానికులు ఈ ఊంజల సేవలో పాల్గొని సీతారాములను దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గుండాల గోపీనాథ్ తొండము నాటి చంద్రశేఖర్ రెడ్డి తొండమునాటి సుబ్రహ్మణ్యం రెడ్డి విజయమ్మ లోక ప్రభాకర్ నాయుడు లక్ష్మమ్మ ముని కృష్ణయ్య చిన్ని మల్లీ తదితర భక్తులు పాల్గొన్నారు

## విద్యాశాఖ ఆదేశాలను లెక్కచేయని... కార్పొరేట్ పాఠశాలలు!

తొట్టంబేడు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త : రాష్ట్ర విద్యాశాఖ నిరుపేదలకు ఉన్నత విద్య,కార్పొరేట్ పాఠశాలల్లో సీట్లు ఉచితం అంటూ ప్రకటిస్తున్నారు.కానీ ఆచరణలో అమలు జరగటం లేదు. ప్రభుత్వం ప్రకటనలతో సంతోష పడుతున్న తల్లిదండ్రులు,కార్పొరేట్ పాఠశాలతీరుపై పెదవి విరిస్తున్నారు. పట్టణంలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ ఉత్తర్వులను పట్టించుకోక పోవడం తీవ్ర వివాదానికి దారితీస్తుంది. సమస్యలను పరిష్కరించాల్సిన విద్యాశాఖ అధికారి చర్యలు తీసుకోకుండా మౌనంగా ఉండడం, దీనితో ఇక ఎవరికి చెప్పుకోవాలో తెలియక దిక్కు తోచని స్థితిలో తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్లితే.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యాహక్కు చట్టం ఆర్టీఈ 2009 లోని 12(1)(సి) ప్రకారం ప్రతి ప్రైవేట్ మరియు అన్ ఎయిడెడ్ పాఠశాలలో 25 సీట్లు బడుగు, బలహీన వర్గాల పిల్లలకు ఉచితంగా ఇవ్వాలని స్పష్టంగా ఆదేశించింది. అందులో భాగంగా 202627 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్‌ని కూడ విడుదల చేసింది.




సాధారణంగా ఇలాంటి నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన విద్యార్థులకు 1వ తరగతి నుండి 8వ తరగతి వరకు పూర్తి ఫీజు మినహాయింపు ఉంటుంది. ఈ ఫీజులను రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం' పథకం ద్వారా తల్లి ఖాతా నుంచి ఆయా పాఠశాలలకు నేరుగా జమ చేసే విధంగా నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 202627 విద్యా సంవత్సరానికి ఈ నోటిఫికేషన్ ద్వారా మొదటి లాటరీ ఫలితాలలో సుమారు 30,075 మంది విద్యార్థులు అర్హత సాధించగా, తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి మండలంలో 22 మంది విద్యార్థులు ఎంపికైనట్లు మండల విద్యాశాఖ అధికారి భువనేశ్వరి అధికారికంగా వెల్లడించారు. ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులు తప్పనిసరిగా ఏప్రిల్ 7వ తేదీ లోపు తమకు కేటాయించిన పాఠశాలల్లో తమ పిల్లలకు అడ్మిషన్ ప్రక్రియ పూర్తి చేయించాలని సూచించారు. అడ్మిషన్ సమయంలో విద్యార్థి ఆధార్ కార్డు, జనన ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, కుల ధృవీకరణ పత్రం, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు మరియు తల్లి బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. అదేవిధంగా ఫీజుల అంశంపై స్పష్టతనిస్తూ,"తల్లికి వందనం" పథకం ద్వారా తల్లి ఖాతాలో జమయ్యే రూ 13,000లో నుంచి పాఠశాలల స్టార్ రేటింగ్ ప్రకారం ఫీజులు ఆటోమేటిక్‌గా ఆయా పాఠశాలలకు బదిలీ అవుతాయని తెలిపారు.మరోవైపు ప్రభుత్వం విద్యాహక్కు చట్టం (ఆర్టీఈ) 2009 12(1)(సి) ప్రకారం నోటిఫికేషన్ లో ప్రైవేట్ పాఠశాలలలో ఏదైనా సమస్యలు ఎదురైతే ఫిర్యాదు చేయడానికి ఒక టోల్ ఫ్రీ నెంబర్ కూడ ఇవ్వడం జరిగిందని, కానీ ఆ నెంబర్ ఇప్పటివరకు పనిచేయకపోవడం, పర్యవేక్షణ లోపంగా ఉన్నదని, ఇది అధికారుల బాధ్యతా రాహిత్యానికి ఇదొక ఉదాహరణగా చెప్పుకోవచ్చని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.

## కన్నులపండువగా సీతారాముల కళ్యాణం



తిరుపతి,ఏప్రిల్ 4ప్రభాతవార్త: శ్రీరామనవమి పర్వదినాల ఉత్సవాల్లో చివరిరోజు శనివారం సాయంత్రం సీతారాముల కళ్యాణం అత్యంత కన్నుల పండువగా జరిగింది. తిరుపతి పెద్దకాపు వీధిలోని శ్రీరామ భజన మందిరంలో సీతారాముల కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానికులు కళ్యాణ మహోత్సవంలో పాల్గొని సీతారాములను దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. సూరా సుధాకర్‌రెడ్డి,విజయమ్మ దంపతులు ఈ సందర్భంగా సీతారాముల కళ్యాణోత్సవానికి ఉభయదారులుగా వ్యవహ రించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గుండాల గోపీనాథ్ రెడ్డి, తొండము నాటి చంద్రశేఖర్ రెడ్డి, సూరా దయాకర్ రెడ్డి,మమత,పోతన,సుర హేమ, ఆదిలక్ష్మి మ్మ, శైలజ,వసంతమ్మ, తొండమునాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, విజయమ్మ, లోక ప్రభాకర్ నాయుడు, లక్ష్మమ్మ, ముని కృష్ణయ్య,చిన్ని తదితర భక్తులు పాల్గొన్నారు

## ఆన్‌లైన్ ఆర్థిక మోసాలపై అప్రమత్తత అవసరం

**- జిల్లా ఎస్పీ తుషార్ డూడి**

చిత్తూరు, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: జిల్లా ప్రజలు పెరుగుతున్న ఆన్‌లైన్ ఆర్థిక మోసాల పట్ల అత్యంత అప్రమత్తంగా వుండాలని జిల్లా ఎస్పీ తుషార్‌డూడి తెలిపారు. ఇటీవల కాలంలో యుపిఐ, డెబిట్, క్రెడిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ చెల్లింపు విధానాలను దుర్వినియోగం చేస్తూ మోసగాళ్లు అమాయక ప్రజలను లక్ష్యంగా పెట్టుకొని మోసగిస్తున్నారన్నారు. ఫేక్ పేమెంట్ లింకులు, క్యూఆర్ కోడ్లు, ఓటిపి మోసాల ద్వారా బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బులు దోచుకొనే సంఘటనలు అనేకం జరుగుతున్నాయని, డిజిటల్ యుగంలో సౌకర్యాలు పెరిగినంత వేగంగా మోసాలు కూడా పెరుగుతున్నాయని, ప్రతి వ్యక్తి జాగ్రత్తగా వుండడం ద్వారా ఈ రకమైన మోసాలను నివారించవచ్చునన్నారు. అలాగే యాప్స్‌లను అధికారిక ప్లేస్టోర్ నుండే డౌన్‌లోడ్ చేసుకోవాలని, మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930హెల్ప్‌లైన్‌కు కాల్‌చేయాలని, అలాగే సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయాలని ఎస్పీ సూచించారు.

## చీకట్లో మగ్గుతున్న భారతరత్న వాజ్ పాయ్



రేణిగుంట, ఏప్రిల్ 4 ప్రభాతవార్త భారత మాజీ ప్రధానమంత్రి భారతరత్న వాజ్ పాయ్ విగ్రహం ఏర్పాటు చేసి నెలలు కావస్తున్న ఇప్పటివరకు ఆయన విగ్రహం చీకట్లోనే మగ్గుతోంది. భారతదేశం వెలిగిపోవాలన్నా స్ఫూర్తితో ప్రధానిగా ఆయన చేసిన సేవలు దేశం యావత్తు ఎప్పటికీ మరిచిపోలేదు. భారత ప్రధానిగానే కాక భారతీయ జనతా పార్టీ కో ఫౌండర్ గా ఆయనకు పార్టీలో ప్రత్యేక స్థానం ఉంది. రేణిగుంట మర్రిగుంట సర్కిల్ వద్ద బిజెపి నేతలు ఆ మహానుభావుని విగ్రహాన్ని ప్రతిష్టించి సర్కిల్‌కు వాజ్ పాయ్ సర్కిల్ గా నామకరణం చేశారు. ప్రతిష్టించి నెలలు గడుస్తున్నా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశించినప్పటికీ ఇంతవరకు ఆ విగ్రహానికి ఒక్క లైటు కూడా వేయకపోవడం గమనార్హం. జిల్లా కలెక్టర్ కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ సమర్పించామని ఓ బిజెపి నేత అంటున్నాడు. కూడలి మొత్తం ఎల్ఇడి లైట్లతో వెలిగిపోతుంది. వాజ్ పాయ్ విగ్రహం మాత్రం చీకట్లో మగ్గిపోతుంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి లైట్ వేస్తారో? లేదో వేచి చూడాలి, బిజెపి ఆవిర్భావ దినోత్సవం ఏప్రిల్ 6 తేదీ నాటికైనా లైట్ వేస్తారని ఆశిద్దాం.....

## పాకాలలో అనుమానాస్పద మృతి

పాకాల, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: పాకాల మండలం పులివర్తివారిపల్లి సమీపం లోని మామిడి తోటలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. చంద్రగిరి మండలం తొండవాడ గ్రామానికి చెందిన చలమచర్ల ప్రవీణ్ కుమార్ (46) మృతుడిగా గుర్తించారు. పోలీసుల సమాచారం మేరకు, ప్రవీణ్ కుమార్ గత నెల 28న వ్యవసాయ పనుల కోసం తోటకు వెళ్లి, అనారోగ్యంతో అక్కడే ఉంటానని కుటుంబ సభ్యులకు తెలిపారు. ఏప్రిల్ 2 వరకు ఫోన్‌లో మాట్లాడిన ఆయన, అనంతరం స్పందించక పోవడంతో కుటుంబ సభ్యులు తోటకు వెళ్లి చూడగా, షెడ్డు సమీపంలో కుళ్ళిన స్థితిలో మృతదేహం కనిపించింది. మృతదేహంపై దుస్తులు లేకపోవడం, శరీరం ఉబ్బిపోయి ఉండటంతో కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మార్చి 30న మృతుడితో పాటు 56 మంది అపరిచితులు తోటలో మద్యం సేవించినట్లు సమాచారం లభించడంతో పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పాకాల సిఐ కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం మరణానికి గల కారణాలు వెల్లడయ్యే అవకాశముందని పోలీసులు తెలిపారు.

## గోవిందా...గోవింద నామంతో భజనమండళ్ళ హోరు



తిరుపతి,ఏప్రిల్ 4ప్రభాతవార్త: పవిత్ర క్షేత్రమైన తిరుపతి నగరం శనివారం ఉదయం భక్తిరసంలో మునిగి పోయి ంది. భక్తులు సంప్రదాయ దుస్తుల్లో, నుదుటిపై గోవింద నామాలతో గోవిందరాజస్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఆంజనేయ స్వామి గుడి వద్దకు ఉదయం ఐదు గంటలకు చేరు కున్నారు. అక్కడ నుంచి మేళ తాళాలు, మంగళ వాయిద్యాల మధ్య నగర సంకీర్తన ప్రారంభమవుతుంది. గోవింద.. గోవింద.. అనే నామస్మరణతో మారుమోగే తిరుపతి వీధులు ఆధ్యాత్మిక కాంతిని ప్రసరించాయి. ఈ కార్యక్రమంలో నగర సంకీర్తన మండలి సభ్యులు మునెప్ప గారి మునినాథరెడ్డి ,వాసుదేవ రెడ్డి, గుండాల గోపీనాథ్‌రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు విజయభాస్కర్ రెడ్డి, అన్నూరు మునిరత్నమాచారి,పురుషోత్తమ యాదవ్, మిట్టపల్లి బ్రహ్మానందం, కేశవులు నాగేశ్వరరెడ్డి,రాజేంద్రన్, సుధాకర్ చౌదరి, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, అరుణమ్మ జయమ్మ, పద్మావతి, కళ్యాణి ,సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు

## పిల్లల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి




శ్రీకాళహస్తి, ఏప్రిల్ 4 ప్రభాతవార్త: పిల్లల పట్ల తల్లిదండ్రులు శ్రద్ద చూపాలని వారి కోసం కొంత సమయం కేటాయించాలని శనివారం పట్టణంలోని కొండమిట్టలోని సాయిరాం పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా తల్లిదండ్రుల సమావేశంలో హెడ్మాస్టర్ కె.సి కృష్ణ సూచించారు. సమావేశం పాఠశాల వ్యవస్థాపకురాలు పి.మాలతి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా విద్యార్థుల తల్లి దండ్రులు పలు సమస్యలను వివరించారు. అలాగే సూచనలు చేసారు. హెడ్మాస్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది సాధించిన ప్రగతిని వివరించారు.పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి విద్యాభోదనలు చేస్తున్నామని అయితే ఇళ్ళలో తల్లి దండ్రుల కొంత సమయం కేటాయించాలని వారి చదువుల పట్ల పరిశీలన చేసుకోవాలన్నారు.

## శివయ్య సేవలో కాటసాని



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 4 ప్రభాతవార్త: భోళాశంకరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రం శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం మాజీ శాసనసభ్యుడు మాజీ టిటిడి బోర్డు సభ్యుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి కుటుంబసభ్యులతో పూజలు జరిపించుకున్నారు. ఆయనకు దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ప్రోటోకాల్ ఎఇఒ మోహన్, ఎపిఆర్ఓ రవిలు వేదపండితులచే స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి మృత్యుంజయస్వామి ఆ లయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.

## వాయులింగేశ్వరుని దర్శించుకున్న పంచాయతీరాజ్ కమిషనర్



శ్రీకాళహస్తి ఏప్రిల్ 4 ప్రభాతవార్త: వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన శ్రీకాళహస్తీశ్వరాల యంలో ఆదివారం పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ కుటుంబసమేతంగా పూజలు జరిపించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ఆలయ ఇఓ బికె వెంకటేశులు,ఆలయ దర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్ ప్రోటోకాల్ ఎఇఒ మోహన్, ఎపిఆర్ఓ రవిలు వేదపండితులచే స్వాగతం పలికారు.స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు.ఆలయంలోని శిల్పకళను చూసిన పంచాయతీరాజ్ కమిషనర్ ఆలయ నిర్మాణం ప్రాశస్త్యంను అడిగి తెలుసుకున్నారు.చైర్మెన్ కొట్టెసాయి ఆలయ పాలన అభివృద్ధి గురించి కమిషనర్‌కు వివరించారు.స్వాగతం చెప్పిన వారిలో శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు ఉన్నారు. ఏర్పాట్లును ఆలయ ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి పర్యవేక్షించారు.

## 7న దివ్యాంగుల బస్సు పాసులు జారీ

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 4 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పరిసరాల్లోని దివ్యాంగులకు ఈ నెల 7 బస్సు పాసులు జారికి నిర్ణయించినట్లు శ్రీకాళహస్తి డిపో మేనేజర్ రేవతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ మేరకుఆర్టిసి ఉన్నతాధికారులు ఆదేశాలు జారి చేసినట్లు వివరించారు. ప్రత్యేక ప్రతిభావంతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకం దివ్యాంగశక్తి పథకం గుర్తింపు కార్డులకు ఈ నెల 7న జారి చేయనున్నట్లు రేవతి తెలిపారు. దివ్యాంగులు ఆధార్,సదరం సర్టిఫికేట్,పాస్‌పోర్టు సైజ్ ఫోటోతో శ్రీకాళహస్తిలోని బస్‌స్టేషన్ కౌంటర్‌లో సమర్పించి పాస్‌లను పొందవచ్చునన్నారు.శ్రీకాళహస్తి డిపోలో శ్రీకాళహస్తి,తొట్టంబేడు, కెవిబిపురం, పిచ్చాటూరు,పెళ్ళకూరు,ఏర్పేడు మండాలల్లోని దివ్యాంగులుఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని డిపోమేనేజర్ రేవతి తెలిపారు.

## యస్ఐఆర్‌కు సహకరించండి



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 4 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న యస్ ఐ ఆర్ సర్వేకు సహకరించాలని జమాతే ఇస్లాం హింద్ నాయకులు శనివారం పిలుపు నిచ్చారు.పట్టణంలోని బహాదూరుపేటలోని మస్జిదే ముహమ్మదీయలో జరిగిన సమావేశంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అతి త్వరలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (యస్ఐఆర్)కు సంబంధించి అధికారులు ఇళ్ళ వద్దకు వచ్చినపుడు ప్రతి ఒక్కరు వారు కోరిన సమాచారాన్ని అందించి సహాకరించాలన్నారు. అలాగే వారు కోనే ఆధారాలను కూడా చూపాలని సమావేశం సూచించింది. ఈ మేరకు జిల్లా జమాతే ఇస్లామి హింద్ ఉపాధ్యక్షుడు షేక్అమీర్ బాషా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో నేడు ముస్లింలు ఎదుర్కొం టున్న పలు సమస్యలను చర్చించారు. ముస్లిం ఐక్యతతో తమ సమస్యలను పరిష్కరిం చుకోవాలని కూటమి నాయకుల దృష్టికి తమ సమస్యలను వివరించి పరిష్కరించు కోవాలన్నారు. ఈ సమావేశంలో ప్రముఖులు షేక్ ముహమ్మద్,దావూద్ సాహెబ్,రూహాన్, ముజమ్మిల్ అహమ్మద్, అబ్దుల్ నాశిర్, షబ్బీర్,ఇంతియాజ్ అబూబకర్,ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ సహాయకుల ఉద్యోగాల నియమకాలు

తొట్టంబేడు ఏప్రిల్ 5 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి,తొట్టంబేడు మండలం నందు వివిధ అంగన్వాడి కేంద్రాలలో ఖాళీగా ఉన్న సహాయక ఉద్యోగాల నియామకాలపై భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని సిడిపిఒ బి.శాంతిదుర్గ శనివారం అన్నారు. ఆమె మాట్లాడుతూశ్రీకాళహస్తి,తొట్టంబేడు మండలాలలోఖాళీగా ఉన్న 36అంగన్వాడీ కేంద్రాలనందు అంగన్వాడి సహాయకుల ఉద్యోగాల నియామకలను ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసిందని సోమవారం నుంచి15 రోజులలోగా అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు సంబంధిత ఐసిడిఎస్ కార్యాలయం నందు స్వీకరించబడుతున్నాయని, ఆయా స్థానికంగా ఉండే మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని,దరఖాస్తుదారులు జూలై 1 నాటికీ అభ్యర్థుల వయస్సు 21 సం.లు నుండి 35 సం.లు లోపల వయసు ఉండాలనితెలియజేశారు.యస్.సి., యస్.టి. హాబిటేషన్స్ నందు యస్.సి. యస్.టి. అభ్యర్తులు మాత్రమే ఉద్యోగాలకి దరఖాస్తు చేసుకోవాలని,దరఖాస్తులను సంబంధిత ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్ట్ కార్యాలయం నుండి పొంది,అభ్యర్థులు తమ దరఖాస్తుతో పాటు కులం (యస్.సి/యస్.టి/బి.సి. అయితే),నివాసము,పుట్టి నతేది,పదవ తరగతి మార్క్స్ మెమో, ఆధార్, వికలాంగత్వముకు సంబందించిన ధృవీకరణ పత్రాలను జతపరిచి సంబందిత ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్ట్ కార్యాలయంలో దరఖాస్తు ఇవ్వాల్సిందిగాతెలియజేశారు.జి.ఓ. ఎం.ఎస్.నెం.13 26.06.2019 ప్రకారం అంగన్వాడీ కార్యకర్త గౌరవ వేతనం: రూ.11500/నెలకు, మరియు అంగన్వాడీ హెల్పర్ గౌరవ వేతనం: రూ.7000/ నెలకు చెల్లించబడతాయని అభ్యర్థులు వీటిని గమనించాలన్నారు, మరిన్ని వివరాల కోసం ఐసిడిఎస్ కార్యాలయానికి సంప్రదిస్తే అభ్యర్థులకు కావాల్సిన వివరాలను తెలియజేస్తామన్నారు అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

## రిలే దీక్షలు విరమణ

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 4 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి ఆర్‌డిఓ కార్యాలయం వద్ద తొట్టంబేడు మండలం పూడి గ్రామానికి చెందిన గిరిజనులు తమ భూ సమస్య పరిష్కారానికి చేపట్టిన రిలే నిరాహార దీక్షలను శనివారం విరమించారు. నాలుగు రోజుల పాటు సాగించిన దీక్షలను పరిశీలించిన ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి శిబిరం వద్దకు వెళ్లి బాధితులతో చర్చించారు. వారం రోజుల లోపల సమస్యను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. దాంతో కెవిపియస్ జిల్లా గౌరవాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య బాధితులకు నిమ్మరసం ఇచ్చి విరమింపజేసారు.ఈ సందర్భంగా సహాకరించిన అందరికి ధన్యవాదాలు తెలిపారు.ఈ సమావేవంలో యానాది సంఘం రాష్ట్ర జిల్లా నాయకులు ప్రభాకర్, చందమామల కోటయ్య, ఎరుకల సేవా సంఘం అధ్యక్షుడు ఆనంద్, హరినాథ్, ఇద్వా జిల్లా అధ్యక్షురాలు ఈశ్వరి,గందం మణి,మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

## యోగాభ్యాసం నిత్యకృత్యంగా మారాలి

**యోగాచార్యులు మార్కండేయులు**



శ్రీకాళహస్తి ఏప్రిల్ 4 ప్రభాతవార్త: అనునిత్యం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ, తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్న మానవ సమాజానికి సాంత్వన చేకూర్చి, మెరుగైన ఆరోగ్యాన్ని అందించే యోగాభ్యాసం మనిషి జీవితంలో నిత్యకృత్యం కావాలని యోగా చార్యులు మార్కండేయులు శనివారం పిలుపు నిచ్చారు. విద్యాప్రకాశానందస్వామిచే స్థాపిం చబడిన శుకబ్రహ్మాశ్రమంలో నిర్వహిస్తున్న వార్షికోత్సవం సందర్భంగా యోగ శిక్షణ శిబిరంలో పరిచయ శిక్షణలో ఉత్తీర్ణులైన వారికి విద్యా వికాస పరిషత్ వారు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా యోగాచార్యులు మార్కండేయులు మాట్లాడుతూ మానవ సమాజాన్ని ఆధ్యాత్మికంగా ముందుకు తీసుకెళ్ళడానికి యోగాభ్యాసం అనేది దివ్య సాధనంగా ఉపయోగపడుతుందని, శారీరక భంగిమలు (ఆసనాలు), శ్వాస పద్ధతులు (ప్రాణాయామం) మరియు ధ్యానాన్ని మిళితం చేసే ఒక ప్రాచీన భారతీయ మనోశారీరక అభ్యాసమే యోగాభ్యాసం అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు భాస్కర్ నాయుడు, రాజేశ్వరరావు, యోగాభ్యాసకులు నివేదిత, రేణు,సరస్వతీ, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఉమా మహేష్ ని సన్మానించిన సీనియర్ లక్ష్మీపతి రెడ్డి



శ్రీకాళహస్తి ఏప్రిల్ 4 ప్రభాతవార్త ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విడుదల చేసిన జూనియర్ సివిల్ జడ్జ్ ఫలితాలలో అద్భుతమైన ప్రతిభను కనబరిచి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన తన శిష్యుడు జూనియర్ న్యాయవాది తిరుకాల ఉమా మహేష్ ని తన ఆఫీసులో చిరు సన్మానం చేసి తనని అభినందించారు . తన సీనియర్ న్యాయవాదైన సున్నపు లక్ష్మీపతి రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ తిరుకాల ఉమా మహేష్ న్యాయవాద వృత్తిని చేపట్టి ఎంతో క్రమశిక్షణతో న్యాయ వ్యవస్థ పై అధ్యాయం చేసి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైనందుకు తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని ఉమా మహేష్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అలాగే వారి తల్లిదండ్రులైన తిరుకాల మల్లికార్జున గౌడ్ , సుమతి సోహిత్ పడిన కష్టానికి ఉమామహేష్ సాధించిన విజయంతో మంచి ఫలితం లభించింది అన్నారు . ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బషీర్ అహ్మద్, మోహన్ బాబు, ఉమా మహేష్‌ని అభినందించారు

## నగరంలో ట్రాఫిక్ పోలీసులతో అవగాహన

తిరుపతి,ఏప్రిల్ 4ప్రభాతవార్త: విద్యార్థులకు రోడ్డు భద్రతపై ప్రత్యేక శిక్షణలో భాగంగా హెల్మెట్ వినియోగం, ట్రాఫిక్ నియమాలపై చైతన్యం కలిగిస్తున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బ రాయుడు ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు నగర వ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ప్రధాన కూడళ్లు, రహదారులు ,విద్యాసంస్థలలో ప్రజలకు, విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిర్వహణ, హెల్మెట్ ధరించడం యొక్క ప్రాముఖ్యత, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, జీబ్రా క్రాసింగ్ వినియోగం వంటి విషయాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ ఏ సంజీవ్‌కుమార్, ఎస్ఐ బాలాజీ పాల్గొన్నారు.